# ప్రజాశక్తి

మంగళవారం 27 ఆగస్టు 2024

పేజీలు 8








కర్నూలు నంద్యాల


# 'నామినేటెడ్' ఎవరికో..?

- భారీగా ఆశావహులు
- టిడిపి అధిష్టానంపై ఆశలు



**ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి**

నూతనంగా ఏర్పడిన టిడిపి కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పదవుల భర్తీపై దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో నామినేటెడ్ పదవులు ఎవరికి దక్కుతాయో అన్న ఉత్కంఠ నెలకొంది. జిల్లాలో ఆశావహులు భారీగానే ఉన్నారు. వారందరూ టిడిపి అదిష్టానంపై ఆశలు పెట్టుకున్నారు. తమకు ఏదో ఒక పదవి దక్కుతుందన్న ఆశాభావంతో ఉన్నారు...



పాలకుర్తి తిక్కారెడ్డి



వాహిద్ హుస్సేన్



ధర్మవరం సుబ్బారెడ్డి

ఉమ్మడి కర్నూలు జిల్లాలో టిడిపి కూటమి మంచి విజయాన్నే సాధించింది. జిల్లాలో 14 అసెంబ్లీ, రెండు పార్లమెంట్ స్థానాలు ఉండగా 11 అసెంబ్లీ స్థానాల్లో టిడిపి, ఒక అసెంబ్లీ స్థానంలో బిజెపి అభ్యర్థి కూటమి తరపున గెలుపొందారు. రెండు పార్లమెంట్ స్థానాల్లోనూ టిడిపి అభ్యర్థులు విజయం సాధించారు. ఎన్నికల్లో (మిగతా 3వ పేజీలో..)

# రైతుల సంక్షేమమే లక్ష్యం : మంత్రి బీసీ

- 'ఎత్తిపోతల' ద్వారా అక్కజమ్మ చెరువుకు నీటి విడుదల



అక్కజమ్మచెరువు ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి

వార్త 3లో

# కూలి యాప్‌ను ఆవిష్కరించి మంత్రి భరత్



యాప్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి టిజి భరత్

**ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్**

ప్రజలకు అన్ని రకాల సేవలను చేరువ చేసేందుకు రూపొందించిన కూలి యాప్‌ను రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ ఆవిష్కరించారు. కర్నూలులోని రామ్ ఇండియా స్మార్ట్ డిజిటల్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఈ కూలీ యాప్‌ను తీసుకొచ్చింది. వివిధ గ్రామాల్లో ఉన్న ప్రజలకు టైలరింగ్, ప్లంబర్, మెడికల్, కిరాణం స్టోర్, హోటల్స్, రోజువారి కూలి, పాల ఉత్పత్తులు, లాయర్స్ ఇలా తదితర సేవలన్నీ సులభతరంగా అందుబాటులోకి తీసుకు రావాలన్న ఉద్దేశంతో దీన్ని తీసుకొచ్చారని మంత్రి చెప్పారు. టెక్నాలజీని అందిపుచ్చుకొని కొత్త యాప్‌లు తీసుకురావడం సంతోషించే విషయమన్నారు. కార్యక్రమంలో కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ కల్యాణ్, తదితరులు పాల్గొన్నారు.



# బ్రిడ్జి కం బ్యారేజీ నిర్మాణానికి స్థల పరిశీలన

వార్త 3లో

# యుద్ధం వద్దు.. శాంతి కావాలి

వార్త 3లో


ట్యాంక్ చుట్టూ నిలువ చేరిన మురికినీరు

## మురికి కుంటలా నీళ్ల ట్యాంకు ఆవరణం

**- ఇలా ఉంటే నీరు తాగేదెలా అంటున్న గ్రామస్తులు**

**ప్రజాశక్తి - రుద్రవరం**

ప్రజలకు ప్రస్తుత సమయంలో వచ్చే రోగాలన్నీ మంచి నీటిపైనే ఆధారపడి ఉన్నాయి. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేసే నీటి ట్యాంకు చుట్టూ మురికి నీరు చేరి కుంటను తలపిస్తున్న సంఘటన మండలంలోని మాచినేని పల్లె గ్రామంలో చోటు చేసుకుంది. మాచినేనిపల్లె గ్రామస్తులకు మంచినీటిని సరఫరా చేసే ట్యాంకు చుట్టూ ట్యాంక్ నుండి లీకేజీ వల్ల వచ్చిన ప్రతి నీటి చుక్క అక్కడే నిలిచి చివరికి అది కుంటలా మారింది. ట్యాంకుకు అతి సమీపంలో ప్రాథమిక పాఠశాల ఉంది. ట్యాంక్ చుట్టూ నిల్వ చేరిన నీరు రోజురోజుకు రంగులు మారుతూ దోమలు చేరి వృద్ధి చెందుతున్నాయని గ్రామస్తులు తెలిపారు. ట్యాంకు చుట్టూ కింది భాగాన ఇలా ఉంటే కలుషితమైన నీరును తాగేదెలా అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మంచినీటి ట్యాంకును శుభ్రపరచి, ట్యాంక్ చుట్టూ నిలువ చేరిన మురికి కుంటను తొలగించి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరును అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## యాగంటి క్షేత్రంలో జిల్లా కలెక్టర్

**ప్రజాశక్తి - బనగానపల్లె**

మండలంలోని ప్రముఖశైవ క్షేత్రం యాగంటి శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థానంలో జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాగంటి దేవస్థానానికి వచ్చిన జిల్లా కలెక్టర్ రాజకుమారికి ఆలయ ఈవో చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పూజారులు, సిబ్బంది పూర్ణకుంభాభిషేకంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఉమామహేశ్వరులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్‌ను ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించి ఉమామహేశ్వరుల చిత్రపటాన్ని ఈవో అందజేశారు. ఈ కార్యక్రమంలో యాగంటి పల్లె ఉపసర్పంచ్ బండి మౌళీశ్వర రెడ్డి, శివరామిరెడ్డి, రామశేఖర్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.


కలెక్టర్‌కు స్వాగతం పలుకుతున్న ఇఒ చంద్రశేఖర్ రెడ్డి

## ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

**ప్రజాశక్తి - బేతంచెర్ల :** బేతంచర్ల మండలం గోర్లగుట్ట గ్రామానికి చెందిన హరిజన బోయినపల్లి హనుమంతు (30) సోమవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు... హనుమంతు భార్య కుళ్లాయమ్మతో పాటు కూలీ పని చేసుకుని జీవించేవారు. హనుమంతు మద్యానికి బానిసై తరచూ భార్యతో గొడవ పడడంతో ఆమె పుట్టింటికి వెళ్ళిపోయింది. హనుమంతు ఉదయం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

## సెలవు రోజూ వినతులు స్వీకరణ

**ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్**

శ్రీ కృష్ణ జన్మాష్టమి పండుగ సందర్భంగా ప్రభుత్వ సెలవు దినం అయినప్పటికీ జిల్లా కలెక్టరేట్‌కు వచ్చిన ప్రజల నుండి డిఆర్ఒ పద్మజ సోమవారం వినతులు స్వీకరించారు. కలెక్టరేట్‌లోని సెంటినరీ హాలు ఆవరణలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా వచ్చిన అర్జీదారుల నుండి దరఖాస్తులు డిఆర్ఒ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు స్వీకరించారు.


వినతులు స్వీకరిస్తున్న డిఆర్ఒ పద్మజ

# పొన్నాపురంలో మెగా రక్తదాన శిబిరం

**ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్**

నంద్యాల పరిధిలోని పొన్నాపురం గ్రామంలో శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా తలసేమియా చిన్నారుల కోసం, గర్భిణుల కోసం మెగా రక్తదాన శిబిరాన్ని 19 వార్డు పొన్నాపురం ఇంచార్జ్ కోడూరు జగదీష్ సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తలసేమియా చిన్నారుల కోసం, గర్భిణుల కోసం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇలా పండగ పూట, పుట్టినరోజుల సందర్భంగా ప్రతి ఒక్కరూ ఓ మంచి కార్యక్రమాన్ని చేయాలన్నారు. రక్తదాన శిబిరాలు, మొక్కలు నాటే కార్యక్రమం, అనాథలకు అన్నదాన కార్యక్రమాలు లాంటివి చేయడం చాలా శ్రేయస్కరమన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన కోడూరు జగదీశ్‌ని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో జనసేన నంద్యాల సమన్వయ కర్త పిడతల సుధాకర్, పబ్బతి రవి, శీలం శ్రీకాంత్ , విద్యాకమిటీ చైర్మన్ నాగార్జున, వంశీ, క్రిష్ణ, రాఘువ, నరసింహ, టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ప్రారంభిస్తున్న టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్

# జిల్లా సీనియర్ చెస్ జట్ల ఎంపిక పోటీలు

**ప్రజాశక్తి - నంద్యాల**

నంద్యాల జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో సోమవారం రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో సీనియర్ ఓపెన్, బాలికల జిల్లా చెస్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా చెస్ సంఘం అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ చదరంగం మెదడుకు పదును పెడుతుందని, ఈ క్రీడ వలన బాలలలో మానసిక వికాసం కలుగుతుందని, ఏకాగ్రత పెరుగుతుందని అన్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నిజాముద్దీన్ మాట్లాడుతూ చదరంగం క్రీడ విద్యార్థులలో గెలుపు ఓటములను స్వీకరించే మనస్తత్వం, ఓటమి చెందాక తిరిగి గెలవాలనే పట్టుదల పెంచే క్రీడ అన్నారు. క్రీడా భారతి జిల్లా కార్యదర్శి నిమ్మకాయల సుధాకర్ మాట్లాడుతూ తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యాలు విద్యార్థులను క్రీడలలో ప్రోత్సహించాలని కోరారు. లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు సోమేశుల నాగరాజు మాట్లాడుతూ నిరంతర సాధన ద్వారా చదరంగంలో మెలకువలను, నైపుణ్యాన్ని పెంచుకోవాలని కోరారు. ఆంధ్ర చెస్ సంఘం సంయుక్త కార్యదర్శి రామ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఓపెన్, బాలికల జిల్లా చదరంగం జట్టు ఎంపిక పోటీలలో విజేతలుగా నిలిచిన వారు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రీడాభారతి కార్యవర్గ సభ్యులు ఎల్లయ్య పాల్గొన్నారు.


ప్రారంభిస్తున్న జిల్లా చెస్ సంఘం అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ

## పోస్టాఫీస్‌లో చోరీకి విఫలయత్నం

**ప్రజాశక్తి - బనగానపల్లె**

బనగానపల్లె పోస్ట్ ఆఫీస్‌లో గుర్తుతెలియని దొంగలు తాళాలు పగలగొట్టి లోనికి ప్రవేశించి లాకర్‌లో ఉన్న నగదును తీసేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. సిఐ కష్ణయ్య యాదవ్ తెలిపిన వివరాల మేరకు... ఆదివారం రాత్రి గుర్తు తెలియని దొంగలు పోస్ట్ ఆఫీస్ తాళాలు పగలగొట్టి లోనికి వెళ్లి సేఫ్ లాకర్‌లో ఉన్న నగదును తీసేందుకు తీవ్ర ప్రయత్నం చేశారు. లాకర్ రాకపోవడంతో వెనుదిరిగి వెళ్లారు. సోమవారం ఉదయం స్వీపర్ పోస్ట్ ఆఫీస్‌లో శుభ్రం చేయడానికి రాగా తాళాలు పగలగొట్టి ఉండడంతో ఇన్చార్జి పోస్టుమాస్టర్ దస్తగిరి రెడ్డికి సమాచారం ఇచ్చారు. ఆయన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో నంద్యాల నుండి క్లూస్ టీం, కర్నూల్ నుండి డాగ్స్ స్క్వాడ్‌తో పోలీసులు వచ్చి లాకర్లను పరిశీలించారు. లాకర్‌లో నగదు ఉండడంతో పోస్ట్ ఆఫీస్ సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. ఈ సందర్భంగా సిఐ కృష్ణయ్య యాదవ్ మాట్లాడుతూ నాలుగో శనివారం, బ్యాంకు సెలవు ఉండడంతో పోస్ట్ ఆఫీస్‌కు వచ్చిన రూ. 8.16 లక్షల నగదును లాకర్‌లో ఉంచారని తెలిపారు. దొంగతనానికి ప్రయత్నించినా ఎలాంటి నగదు పోలేదన్నారు. దొంగతనానికి పాల్పడిన వ్యక్తులను త్వరలో గుర్తించి అరెస్టు చేస్తామన్నారు.


పోస్ట్ ఆఫీస్‌లో లాకర్ల వద్ద పరిశీలిస్తున్న క్లూస్ టీం, భద్రంగా ఉన్న నగదు రూ. 8.16 లక్షలు

# ఘనంగా చల్లా రామకృష్ణా రెడ్డి జయంతి

**ప్రజాశక్తి - అవుకు**

దివంగత ఎమ్మెల్సీ చల్లా రామకృష్ణారెడ్డి 76వ జయంతి వేడుకలను కుటుంబ సభ్యులు సోమవారం ఘనంగా నిర్వహించారు. చల్లా ఫామ్ హౌస్‌లోని ఆయన సమాధి వద్ద యువ నాయకులు చల్లా విగ్నేశ్వర్ రెడ్డి సోదరులు చల్లా రాజశేఖర్ రెడ్డి, చల్లా భాస్కర్ రెడ్డి, చల్లా రఘునాథ రెడ్డి, పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డిలు, చల్లా అభిమానులు, కార్యకర్తల నడుమ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దివంగత ఎమ్మెల్సీ చల్లా రామకృష్ణారెడ్డి ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తానని పెద్ద కుమారుడు చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి అన్నారు.


చల్లా సమాధి వద్ద నివాళులర్పిస్తున్న చల్లా విగ్నేశ్వర్ రెడ్డి

# గులాబీ రంగు పురుగు నివారణకు సస్యరక్షణ చర్యలు

**- రైతులకు ఉచితంగా లింగాకర్షక బుట్టలు పంపిణీ**

**ప్రజాశక్తి - ఆళ్లగడ్డ**

పత్తిలో గులాబి రంగు పురుగు నివారణకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని దొర్నిపాడు మండల వ్యవసాయ అధికారిని సునీత పేర్కొన్నారు. తాలూకాలోని దొర్నిపాడు మండల కేంద్రం వ్యవసాయ మార్కెట్ హాల్లో 'జాగృతి' ప్రాజెక్టులో భాగంగా యల్‌డిసి (ఎల్‌సిడి) బేయర్ కంపెనీ ఆధ్వర్యంలో రైతులకు పత్తిలో గులాబి రంగు పురుగు నివారణ యాజమాన్యంజపై అసిస్టు సంస్థ ఆధ్వర్యంలో వీఆర్వో ద్వారా వివరించారు. అనంతరం రైతులకు లింగాకర్షణ బుట్టలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎల్‌డిసి కంపెనీ ప్రతినిధి ఉపేంద్ర రెడ్డి, శ్రీరామన్నారాయణ దండ, బేయర్ క్రాఫ్ సైన్స్ కంపెనీ ప్రతినిధి సంతోష్, మాజీ జెడ్పిటిసి బ్రహ్మానంద రెడ్డి, ఏవో శ్రీకృష్ణ, ఎల్డిసి ప్రతినిధి రాఘవరెడ్డి, అసిస్ట్ డిప్యూటీ డైరెక్టర్ రవిబాబు, వీఆర్వో నరసింహారెడ్డి, టీ స్టేన్స్ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయ అధికారిని సునీత


వీల్‌చైర్లను అందజేస్తున్న చైర్మన్ డాక్టర్ గోవింద్ రెడ్డి, సెక్రటరీ శ్రీనివాసులు

## ఆలయానికి వీల్ చైర్స్ విరాళం

**ప్రజాశక్తి - బేతంచెర్ల**

బేతంచర్ల మండలం ఆర్ఎస్ రంగాపురం గ్రామ పరిధిలో వెలసిన మద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ గోవిందరెడ్డి, సెక్రెటరీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో 5 వీల్ చైర్స్ వికలాంగ భక్తుల కోసం విరాళంగా ఆలయం ఈవో, ఉప కమిషనర్ రామాంజనేయులుకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ స్వామి వారిని దర్శించుకోవడానికి వచ్చిన భక్తులకు మెరుగైన సేవలు అందించడంలో భాగంగా నడవలేని, వృద్ధ వికలాంగులకు స్వామివారి దర్శనం సులభతరం చేయడానికి వీల్ చైర్లు అందజేశామన్నారు.

## గ్రామీణ ఆలయాల అభివృద్ధికి కృషి

**ప్రజాశక్తి - బనగానపల్లె**

గ్రామీణ దేవాలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జెకెఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు జెఎస్ఎస్ బ్రహ్మానంద ఆచారి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పలుకూరు గ్రామంలో రామాలయంలో జెఎస్ఎస్ బ్రహ్మానంద చారి ఆధ్వర్యంలో భక్తి పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సుబ్బారెడ్డి, రాంపుల్లారెడ్డి, కేజీ వెంకటసుబ్బయ్య గౌడ్, బాల హనుమంతు, తిరుమలేష్, భక్త బృందం పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో గని కార్మికుడు మృతి

**ప్రజాశక్తి - అవుకు**

మండలంలోని సంగపట్నం గ్రామ సమీపంలోని నాపరాతి గనుల్లో విద్యుత్ షాక్‌కు గురై కార్మికుడు వెంకట సుబ్బన్న (47) సోమవారం మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. సీఐ మంజునాథరెడ్డి, ఎస్సై రాజారెడ్డి, విద్యుత్ శాఖ ఏఈ పకీరయ్యలు తెలిపిన వివరాల మేరకు.. నాపరాతి గనుల్లో ఉపయోగించే కోత మిషన్ యంత్రానికి ఏర్పాటు చేసిన విద్యుత్ తీగల కనెక్షన్ సక్రమంగా లేకపోవడంతో వెంకట సుబ్బయ్యకు విద్యుత్ షాక్ కొట్టడంతో మృతి చెందాడు. వెంటకసుబ్బన్న కొలిమిగుండ్ల మండలం బెలుం గ్రామ వాసిగా పోలీసులు గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## చింతల సుబ్బరాయుడు మృతి బాధాకరం : టిడిపి

**ప్రజాశక్తి - నంద్యాల**

నంద్యాల పురపాలక మాజీ కౌన్సిలర్, మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్, టిడిపి సీనియర్ నాయకులు చింతల సుబ్బరాయుడు ఆదివారం రాత్రి మృతి చెందడం బాధాకరమని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వెదుర్ల రామచంద్ర రావు అన్నారు. సోమవారం ఆయన సంతాపం ప్రకటిస్తూ మాట్లాడారు. నిజాలను నిర్భయంగా మాట్లాడే మనస్తత్వం కలిగిన వ్యక్తి, ఇటీవలి ఎన్నికలలో టిడిపి విజయానికి విశేషంగా కృషి చేసిన చింతల సుబ్బరాయుడు మతి పార్టీకి, నంద్యాల బలిజ సామాజిక వర్గానికి తీరని లోటన్నారు. సంతాపం ప్రకటించిన వారిలో వర్ధంశెట్టి రాజారాం, డాక్టర్ గుర్రాల రవి కృష్ణ, ఎవిఆర్ ప్రసాద్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఎంపివి.రమణయ్య, వికలాంగుల సంక్షేమ సంఘం సమన్వయకర్తలు ఉన్నారు.

# రైతుల సంక్షేమమే లక్ష్యం : మంత్రి బీసీ

**- 'ఎత్తిపోతల' ద్వారా**
**అక్కజమ్మ చెరువుకు నీటి విడుదల**

**ప్రజాశక్తి - బనగానపల్లె**

రైతుల సంక్షేమమే టిడిపి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం బనగానపల్లె మండలం చెరువుపల్లె గ్రామంలోని అక్కజమ్మ చెరువుకు ఎస్ఆర్బిసి కాలువ నుండి ఎత్తిపోతల పథకం ద్వారా మంత్రి బీసీ మోటార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి స్విచ్ ఆన్ చేసి అక్కజమ్మ చెరువుకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ టిడిపి పాలనలోనే ఎత్తిపోతల పథకాలను మంజూరు చేసి సాగునీటిని ఇచ్చేందుకు కృషి చేసినట్లు తెలిపారు. వైసిపి 5 సంవత్సరాల పాలనలో ఒక్క ఎత్తిపోతల పథకాన్ని కూడా మంజూరు చేయలేదన్నారు. నీటి పారుదల శాఖ రాష్ట్ర చైర్మన్‌గా బనగానపల్లె నియోజకవర్గంకు చెందిన కర్ర గిరిజా ఉన్న 5 సంవత్సరాలలో నియోజకవర్గానికి ఒక్క ఎత్తిపోతల పథకాన్ని కూడా మంజూరు చేయించలేకపోయారని తెలిపారు. వైసిపి పాలనలో ఎత్తిపోతల పథకాలకు నిధులు మంజూరు చేయకుండా నిర్వీర్యం చేశారన్నారు. టిడిపి పాలనలోనే చెరువు పల్లె అక్కజమ్మచెరువుకు, సంగపట్నం చెరువుకు, దద్దనాల ప్రాజెక్టుకు ఎత్తిపోతల పథకాలను మంజూరు చేసినట్లు తెలిపారు. టిడిపి పాలనలో చెరువుపల్లె అక్కజమ్మ చెరువు ఎత్తిపోతల పథకానికి 2.29 కోట్ల రూపాయల నిధులను మంజూరు చేసినట్లు తెలిపారు. వైసిపి 5 సంవత్సరాల పాలనలో పనులు నత్తనడకన నడిచాయని, ఎన్నికల సమయంలో మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పనులు జరగకపోయినా ట్రైల్ రన్ నిర్వహించారని అన్నారు. అక్కజమ్మ చెరువు ద్వారా 126 ఎకరాల ఆయకట్టు భూమికి నీరు అందించడమే గాక బోర్లలో భూగర్భ జలాలు పెరగనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పనులను పూర్తి చేసి ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించామని చెప్పారు. కూటమి పాలనలో పుష్కలంగా వర్షాలు పడడం వల్ల రైతులు సంతోషంగా ఉన్నారని, గత ఐదేళ్ళ నీళ్ళ లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని తెలిపారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎత్తిపోతల పథకాలు, చెరువుల మరమ్మతులకు నిధులు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నదుల అనుసంధానం చేసి ప్రతి ఎకరానికి సాగునీరు ఇచ్చేందుకు కృషి చేస్తున్నారని అన్నారు. కేంద్ర సహకారంతో నదులను అనుసంధానం చేస్తున్నట్లు తెలిపారు. రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అంబాల రామకృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ మద్దిలేటి, టిడిపి నాయకులు పలుకూరు శంకర్, ఐటిక్యాల శరత్ కుమార్, ఇరిగేషన్ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## వైభవంగా పల్లకి సేవ మహోత్సవం

**ప్రజాశక్తి - బనగానపల్లె**

మండలంలోని ప్రముఖ శైవక్షేత్రం యాగంటి, శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థానంలో పల్లకి సేవ మహోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. ప్రదోషకాల ప్రత్యేక పూజల అనంతరం స్వామిఅమ్మవార్లను పల్లకిలో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో చంద్రశేఖర్ రెడ్డి, పాతపాడు సర్పంచి బెడదల మహేశ్వర రెడ్డి, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



పల్లకి సేవ మహోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం


# బ్రిడ్జి కం బ్యారేజీ నిర్మాణానికి స్థల పరిశీలన

**ప్రజాశక్తి - కౌతాళం**

తుంగభద్ర నదిపై కర్నూల్ జిల్లా కౌతాళం మండలం కుంబళనూర్ దగ్గర కర్ణాటకలోని రాయచూరు జిల్లా మాన్వి తాలూకా చిక్కల్గి గ్రామాన్ని అనుసంధానం చేస్తూ బ్రిడ్జి కం బ్యారేజ్ నిర్మాణానికి స్థలాన్ని కర్ణాటక చిన్న నీటి పారుదల శాఖ మంత్రి బోసరాజు, మాన్వి ఎమ్మెల్యే అంపాయ నాయక్ సోమవారం పరిశీలించారు. బ్రిడ్జ్ కం బ్యారేజ్ నిర్మాణానికి రూ.397.5 కోట్ల రూపాయలు కర్ణాటక ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఈ నిర్మాణం ద్వారా కర్ణాటక ప్రాంతంలోని సిరుగుప్ప, సింధనూర్, మాన్వి తాలూకా పరిధిలోని వివిధ గ్రామాలకు సాగు తాగునీరు అందుతాయన్నారు. సుమారు 25 వేల ఎకరాలు సాగునీరు అందించవచ్చని అభిప్రాయం వ్యక్తం చేశారు. త్వరలో ప్రభుత్వం, వివిధ అనుమతులు, టెండర్లు ప్రక్రియ పూర్తి చేసిన అనంతరం కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధ రామయ్య చేతుల మీదుగా నిర్మాణానికి భూమి పూజ జరిగేలా చూస్తామన్నారు.

**కర్ణాటక మంత్రిని కలిసిన రైతులు**

తుంగభద్ర నదిపై బ్రిడ్జ్ కం బ్యారేజ్ నిర్మాణానికి స్థల పరిశీలనకు వచ్చిన కర్ణాటక చిన్న నీటి పారుదల శాఖ మంత్రి బోసరాజును నదిచాగి, కుంబళనూరు, క్యాంప్ గ్రామాల రైతులు కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ బిడ్జి కమ్ బ్యారేజ్ నిర్మాణం వాటర్ స్టోరేజ్ వల్ల గ్రామాలకు, పంట పొలాలకు ఎలాంటి నష్టం వాటిల్లకుంట రెండు ప్రభుత్వాలు చర్యలు జరిపి న్యాయం చేయాలని కోరారు. అన్ని అంశాలను గౌరవిస్తూ రైతులకు పూర్తి సహకారం అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. వారంలో నదీ తీర రైతులను స్వయంగా తన ఇంటికి పిలిపించి మాట్లాడుతానని హామీ ఇచ్చారు. అనంతరం మంత్రి బోస్ రాజును, మాన్వి ఎమ్మెల్యే అంపాయ నాయక్‌ను రైతులు శాలువాతో సత్కరించి పూలమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నదిచాగి రామన్నగౌడ, తొగట నాగరాజ, లింగన్న గౌడ, పక్కీరయ్య, చంద్రప్ప, మల్లికార్జున, వలి, క్యాంప్ చిన్న, యంకన్న బాబు, అనిల్ కుమార్ పాల్గొన్నారు.



మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న రైతులు

# యుద్ధం వద్దు.. శాంతి కావాలి

**- అంతర్జాతీయ కార్యాచరణ దినోత్సవంలో పాల్గొనండి**
**- సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు**

**ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్**

పాలస్తీనాలో ఉక్రెయిన్‌లో యుద్ధాలను అమెరికా నాయకత్వంలో ఎగదోస్తుందని ఇజ్రాయిల్ కు అమెరికా ఆయుధాలను సరఫరా చేసి ఇప్పటికీ 40 వేల మందికి పైగా పాలస్తీనా పౌరులను ప్రాణాలను తీయడానికి కారణమైందని దీనికి నిరసనగా సెప్టెంబర్ 1న ప్రపంచవ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాలు యుద్ధాలు వద్దు శాంతి కావాలని నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు తెలియజేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.ఎస్ రాధాకృష్ణ అధ్యక్షతన కార్మిక కర్షక భవన్లో జిల్లా కార్యదర్శి వర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయంగా అమెరికా తన పెత్తనాన్ని కొనసాగించడానికి ప్రయత్నిస్తుందని, అందులో భాగంగా ఉక్రెయిన్ తమ కూటమి అయిన నాటోలో చేర్చుకోవడానికి ప్రయత్నిస్తుందని దీనికి నిరసనగా రష్యా ఉక్రెయిన్ల మధ్య యుద్ధాలు జరుగుతున్నాయని తెలిపారు. సోషలిస్ట్ చైనా తనను మించి బలమైన దేశంగా మారటాన్ని అమెరికా జీర్ణించుకులేకపోతుందని తెలిపారు. చైనాను ఒంటరి పాటు చేయడానికి అమెరికా అన్ని రకాల ప్రయత్నాలు చేస్తుందని విమర్శించారు. ఈ ప్రయత్నంలో మోడీ ప్రభుత్వం భాగస్వామ్యం కావటాన్ని వ్యతిరేకించాలని కోరారు. అంతర్జాతీయంగా సోషలిస్టు వ్యవస్థకు వ్యతిరేకంగా జరుగుతున్న ఈ కుట్రకు నిరసనగా కార్మిక వర్గం ఆందోళన బాట పట్టాల్సిన అవసరం ఉందని తెలియజేశారు. జిల్లాలో అన్ని ప్రాంతాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు డి.గౌస్ దేశాయ్, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ పి.నిర్మల, సిఐటియు జిల్లా నాయకులు పి. ఈరన్న, ఎం.గోపాల్, జె.నాగేశ్వరరావు, కె.ప్రభాకర్, సిహెచ్.సాయి బాబా, నారాయణ స్వామి పాల్గొన్నారు.




మాట్లాడుతున్న నాయకులు ఎండి.అంజిబాబు

# 'నామినేటెడ్' ఎవరికో..?

**మొదటి పేజీ తరువాయి..** సీట్ల కేటాయింపు సమయంలో కొందరు అభ్యర్థులకు మొండి చేయి చూపి ఇతరులకు సీటును కేటాయించారు. వారికి ఏదో ఒక పదవి ఇస్తామంటూ బుజ్జగించారు. అలాంటి వారందరూ ప్రభుత్వంలో తమకు ఏదో ఒక నామినేటెడ్ పదవి వస్తుందన్న ఆశతో ఉన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న వారి సంఖ్య ఎక్కువగానే ఉంది. టిడిపి ప్రభుత్వం నామినేటెడ్ పదవుల భర్తీపై దృష్టి సారించడంతో ఎవరికి వారు తమ తమ స్థాయిలో జోరుగా ప్రయత్నాలు సాగిస్తున్నారు. నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న వారిలో టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి, డోన్ టిడిపి నియోజకవర్గ ఇంఛార్జీ మీనాక్షి నాయుడు, కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త విష్ణువర్ధన్ రెడ్డి, నంద్యాల నియోజకవర్గ మాజీ ఇంఛార్జీ భూమా బ్రహ్మానంద రెడ్డి, మైనార్టీ నాయకులు వాహిద్ హుస్సేన్ ఉన్నారు. రెండు సార్లు మంత్రాలయం నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయి 2024 ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని అనుకున్న పాలకుర్తి తిక్కారెడ్డి ఆయన సీటును త్యాగం చేయాల్సి వచ్చింది. రాఘవేంద్రరెడ్డికి టిడిపి టికెట్ ఇచ్చారు. తిక్కారెడ్డికి టిడిపి జిల్లా అధ్యక్ష పదవిని అప్పగించారు. అధికారంలోకి వస్తే సమున్నత పదవి ఇస్తామని అదిష్టానం హామీ ఇచ్చింది. దీంతో ఆయన ప్రస్తుతం నామినేటెడ్ పదవుల భరీలో ఉన్నారు. పదవులు ఆశిస్తున్న వారిలో డోన్ నియోజకవర్గ మాజీ ఇంఛార్జీ ధర్మవరం సుబ్బారెడ్డి కూడా ఉన్నారు. 2019లో టిడిపి ఓటమి పాలయిన తరువాత సుబ్బారెడ్డిని నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించారు. ఆ తరువాత ప్యాపిలి మండలం జలదుర్గంలో జరిగిన బాదుడే బాదుడు సభలో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు డోన్ టిడిపి అభ్యర్థిగా సుబ్బారెడ్డిని ప్రకటించారు. తీరా ఎన్నికల సమయంలో ఆయనను కాదని డోన్ సీటును కోట్ల సూర్యప్రకాష్ రెడ్డికి ఇచ్చారు. ఇప్పుడు సుబ్బారెడ్డికి నామినేటెడ్ పదవి ఇస్తారన్న వార్తలు వినిపిస్తున్నాయి. నంద్యాల టికెట్ ఆశించిన భూమా బ్రహ్మానందరెడ్డి, వాహిద్ హుస్సేన్‌లకు మొండిచేయి చూపి ఆ టికెట్ను ఎన్ఎండి ఫరూక్‌కు ఇచ్చారు. ఆ సమయంలో వారికి న్యాయం చేస్తామని అదిష్టానం హామీ ఇచ్చింది. ఫరూక్ గెలుపుకు కృషి చేసిన వారికి నామినేటెడ్ పదవులు ఇచ్చేందుకు టిడిపి అదిష్టానం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్తగా పని చేసిన కోట్ల సుజాతమ్మ, మాజీ మంత్రి కెఇ ప్రభాకర్, రాష్ట్ర గొర్రెల సహకార సంఘం అధ్యక్షుడిగా పని చేసిన నాగేశ్వర్ యాదవ్‌తో పలువురు జనసేన, బిజెపి నేతలు కూడా నామినేటెడ్ పదవులను ఆశిస్తున్నట్లు తెలుస్తోంది.

---

**మహారాజ శ్రీ ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి**
**(జూనియర్ డివిజన్) గారి కోర్టు :: నంద్యాల**
**ఓ.యస్. నెం. 478 / 2020**

గోపిరెడ్డి గోపినాథ్ రెడ్డి. ...వాది

**V/S**

బి.శ్రీవాణి భర్త సోముల శివప్రసాద రెడ్డి కేరాఫ్ సోముల రామసుబ్బారెడ్డి ఇంటి నెం. 2-57 గుల్లదుర్తి గ్రామం కోయిలకుంట్ల మండలం నంద్యాల జిల్లా. ...ప్రతివాది

**ప్రతివాదికి దావా సమన్ ప్రకటన**

పై దావ నందు వాది , ప్రతివాది అయినా మీ పైన దావా మొత్తం 1,54,000/- లు రాగోరీ దాఖలు చేసి ఉంటున్నారు. సదరు దావాలో కోర్టు ద్వారా ఎన్ని మార్లు మీకు దావా సామాన్లు పంపించినను మీరు ఉద్దేశపూర్వకంగా తీసుకోనందున, కోర్టు వారి ఉత్తర్వుల మేరకు ఈ పేపర్ ప్రకటన ద్వారా సమన్లు జారీ చేసినందున మీరు 11-09-2024 వ తేదీ ఉదయం 10.30 గంటలకు మీరుగాని,మీ తరుపు వకీల్ గాని హాజరై మీ ఆక్షేపణలను తెలుపుకోవలెను. లేనియెడల పై కోర్టు వారు మీ పరోక్షంగా తీర్మానించబడునని తెలియజేయడమైనది.

**(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)**

**వాయిదా తేది: 11-09-2024**

ఇట్లు
K.సుధాంశు రెడ్డి ,
వాదివరం అడ్వకేట్,
నంద్యాల జిల్లా.
Cell : 6302828849

---

**నోటీసు**

మహారాజ శ్రీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల సమస్యల పరిష్కార కమీషన్, కానూరు, విజయవాడలో FA No. 402/2023 in CC No.93/22 (కర్నూలు జిల్లా వినియోగదారుల ఫోరము కర్నూలు వారి ఫైలు)

Between:
లీలామోహన్ C/o గీతా ఆటో ఫైనాన్స్.
...అప్పిలెంట్/1వ ఆపోజిట్ పార్టీ
మరియు
యం.చిన్న వెంకటేశ్వర్లు వగైరా.
...రెస్పాండెంట్స్/కంప్లైనెంట్

రెస్పాండెంట్ -1,
యం.చిన్న వెంకటేశ్వర్లు తండ్రి యం.దాసన్న OCC లైవ్‌లీహుడ్, R/o 4-1/1, శ్రీపతిరావుపేట, ఇందిరేశ్వరం, ఆత్మకూరు, నంద్యాల జిల్లా.

పై నెంబరు ఎఫ్.ఏలో 1వ రెస్పాండెంట్ అయిన మీకు పైస్టేట్ కమీషన్/శ్రీ కోర్టు ద్వారాను, రిజిస్టరు పోస్టు ద్వారా నోటీసులు పంపినను మీకూ ముట్టనందున ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసు చేయవలసినదిగా పై కోర్టు/స్టేట్ కమీషను వారు ఆర్డర్ వేస్తూ తేది.11/09/2024కి వాయిదా వేసి ఉన్నారు. సదరు వాయిదా రోజు ఉదయం గం॥ 10.30 నిలకు మీరు స్వయంగాగాని లేక మీ అడ్వకేటు ద్వారాగాని పై కమీషన్ వారి ఎదుట హాజరై మీకుగల ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల సదరు అప్పీలును మీ పరోక్షముగ విచారించి తీర్మానించబడును.

**(కోర్టు వారి ఉత్తర్వు ప్రకారం)**

**వాయిదా తేది : 11/09/2024**

కె.వెంకటేశ్వర్లు,
అడ్వకేటు,
ఫ్లాట్ నెం. 1409, ఆదిత్యగ్రాంట్,
Opp : స్కాట్‌స్టైన్ ఇంటర్నేషనల్ స్కూల్,
నవత ట్రాన్స్‌పోర్టు రోడ్,
విజయవాడ. - 520007.

---

**మహారాజ శ్రీ ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి**
**(జూనియర్ డివిజన్) గారి కోర్టు :: నంద్యాల**
**ఓ.యస్. నెం. 1126 / 2019**

చెంచు మహేశ్వరి. ...వాది

**V/S**

చెంచు జయలక్ష్మి భర్త పెద్ద నరసింహ, వయసు 40 సం. హిందూ, బిజినెస్, ఇంటి నెం. 20-102-3-b5 గుడిపాడి గడ్డ వీధి నంద్యాల టౌన్ & నంద్యాల జిల్లా. ...ప్రతివాది

**ప్రతివాదికి దావా సమన్లు**

పై దావ నందు వాదికీ , ప్రతి వాది నుండి డబ్బులు రాగోరి, పై కోర్టులో దావా దాఖలు చేసి ఉన్నారు. కావున సదరు దావా సమన్లునిమిత్తం ప్రతివాది అయిన మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న ఎడల వాయిదా 11-09-2024 వ తేదీ ఉదయం 10.30 గంటలకు స్వయముగా గాని, వకీల్ ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలను తెలుపుకోవలెను. లేనియెడల పై కోర్టు వారు మీ పరోక్షంగా తీర్మానించబడును.

**(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)**

**వాయిదా తేది: 11-09-2024**

ఇట్లు
D. ప్రతాప్ రెడ్డి,
B.V. మధుసూదన్,
వాదివరం అడ్వకేట్,
నంద్యాల జిల్లా.

## ఎస్‌పిని కలిసిన మేయర్

**కర్నూలు కార్పొరేషన్**



జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్‌పి బిందు మాధవ్‌ను కర్నూలు మేయర్ బివై. రామయ్య సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి బొకెను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## శ్రీ కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపిన ఎస్‌పి

**ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్**



శ్రీ కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా ప్రజలకు, పోలీసులకు , వారి కుటుంబ సభ్యులకు , మీడియా సోదరులకు కర్నూలు జిల్లా పోలీసు శాఖ తరపున కర్నూలు జిల్లా ఎస్‌పి జి. బిందుమాధవ్ శ్రీ కృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. కృష్ణాష్టమి రోజు శ్రీకృష్ణుడు ఒత్తిడిలను , ఆందోళనలన్నింటినీ తొలగించి మీకు, మీ కుటుంబ సభ్యులకు ప్రేమ, శాంతి, ఆనందాన్ని అందివ్వాలని కోరుకుంటున్నానన్నారు. శ్రీకష్ణజన్మాష్టమి సామరస్యపూర్వక సమాజాన్ని నిర్మించడానికి పునాదిని ధృవీకరిస్తుందని శ్రీకృష్ణుడు తన సందేశంలో పేర్కొన్నారు. ఈ పర్వదినం సందర్భంగా ప్రజలలో సోదరభావం, స్నేహం, సామరస్యం మరింత బలోపేతం కావాలని శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ప్రజల జీవితాల్లో సంతోషం వెల్లివిరియాలని ఎస్‌పి ఆకాంక్షించారు.



ఆదోని డిఎస్‌పిని కలిసిన టిడిపి నాయకులు బత్తిని కుబేర్‌నాథ్, తదితరులు

## డిఎస్‌పిని కలిసిన బత్తిన కుబేర్ నాథ్

**ప్రజాశక్తి -ఆదోని**

ఆదోని డిఎస్‌పిగా బాధ్యతలు తీసుకున్న సోమన్నను సోమవారం టిడిపి నాయకులు స్థానిక కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బత్తిని కుబేర్‌నాథ్, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి బత్తిని లోకనాథ్ ఆదోని డిఎస్‌పి సోమన్నను కలిసి శాలువా, పూలమాలలతో సన్మానించారు. అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి సారించి శాంతిభద్రలకు విఘాతం కలగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మన్సూర్, లాలికుమార్, టిడిపి యువ నాయకుడు పాల్గొన్నారు.

## సిపిఎం ఆధ్వర్యంలో శ్రమ దానం

**ప్రజాశక్తి- కౌతాళం**



కౌతాళం మండలం బదినేహాల్ గ్రామంలో దేవమ్మ గుడి వద్ద సిపిఎం ఆధ్వర్యంలో శ్రమ దానం చేశారు. సోమవారం సిపిఎం నాయకులు మాట్లాడుతూ దేవాలయం వద్ద చెత్తాచెదారం పేరుకుపోయి వర్షానికి కంపు కొడుతుంటే దాన్ని చూడలేక శ్రమదానం చేశామని తెలిపారు.

## భార్య పుట్టింటికి వెళ్లిందని భర్త ఆత్మహత్య

**ప్రజాశక్తి-నందవరం**

భార్య పుట్టింటికి వెళ్లి తిరిగి కాపురానికి రాలేదని బోయకాసిం అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన హాలహర్వి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బోయ కాశీం అనే వ్యక్తి కూలిపనికి వెళ్లకుండా రోజు మద్యం సేవిస్తూ ఉండేవాడని, ఆయన పెట్టే బాధలు భరించలేక, ఆయనకు తెలివి రావాలన్న ఉద్దేశంతో పుట్టింటికి ఐదు రోజులక్రితం వెళ్లడం జరిగిందని ఇంతలోని ఈ దారుణం జరిగిందని అతని భార్య బోయ ప్రణీత పోలీస్ స్టేషన్ వచ్చి ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# కెవిపిఎస్ ఆధ్వర్యంలో ఆదర్శ వివాహం

**ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్**



మతాంతర వివాహం చేసుకున్న నూతన దంపతులకు అంబేద్కర్‌చిత్రపటాన్ని అందజేస్తున్న ఆనంద్‌బాబు

కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కర్నూలు నగరంలోని కార్మిక కర్షక భవన్‌లో దళిత సామాజిక తరగతికి చెందిన ఆర్.సుంకన్న, ముస్లిం మైనారిటీ మతానికి చెందిన ఎస్.కరిష్మ లకు మతాంతర వివాహం చేశారు. కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఆనంద్ బాబు అధ్యక్షతన జరిగిన వివాహ కార్యక్రమంలో నూతన వధూవరులకు దండలు మార్పించి, వారితో ప్రమాణ పత్రాలను చదివించారు. సంఘ సభ్యులు బంధువుల సమక్షంలో పెళ్లి కార్యక్రమాన్ని నిర్వహించారు. మతాంతర వివాహ కార్యక్రమాన్ని ఉద్దేశించి కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.ఆనంద్ బాబు, ప్రజాశక్తి జనరల్ మేనేజర్ టి నరసింహ, డివైఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శులు వై నగేష్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగప్ప, ఎస్ .అబ్దుల్లా, పెళ్లి కుమారుడి అన్న కెవిపిఎస్ ఓల్డ్ సిటీ అధ్యక్షులు ఆర్. రమణ, ఆర్‌టిఐ కార్యకర్త టి.లక్ష్మీనారాయణ మాట్లాడారు. సమాజంలో కులం, మతం పేరుతో మారణ హోమాలు జరుగుతున్న సందర్భంలో పూలే, అంబేద్కర్, పెరియార్, సుందరయ్యలు చూపిన బాటలో కుల మతాలను బద్దలు కొడుతూ జీవితాంతం ఒకరికి ఒకరు తోడుగా ఉంటామని ఏకమవుతున్న నూతన దంపతులకు వారు శుభాకాంక్షలు తెలిపారు. వినిమయ దారి సంస్కృతి బలంగా అమలులో ఉన్న నేటి సమాజంలో మానవ సంబంధాలు కూడా దెబ్బతింటున్నాయన్నారు. ప్రేమించడం పెళ్లి చేసుకోవడం మాత్రమే గొప్ప కాదని, పెళ్లి చేసుకున్న తర్వాత జీవిత చివరాంకం వరకు ఎన్ని కష్టాలు ఎదురైనా, ఒకరికి ఒకరు తోడుగా నిలబడి సమాజానికి ఒక ఆదర్శవంతమైన జీవితాన్ని కానుకగా ఇవ్వాలన్నారు. తమ పిల్లలు ప్రేమించుకున్నారని అంటేనే కత్తులు కటార్లతో చిన్న సైజు యుద్ధాలను చేసే తల్లిదండ్రులున్న నేటి సమాజంలో తమ పిల్లల ప్రేమకు విలువనిచ్చి పెళ్లికి అంగీకరించడం పిల్లల పట్ల వారికున్న వెలకట్టలేని ప్రేమకు నిదర్శనమని, వధూవరుల తల్లిదండ్రులను అభినందించారు. ఈ వివాహంలో పెళ్లి కుమార్తె తల్లిదండ్రులు ముంతాజ్, మహబూబ్ బాషా, పెళ్లి కుమారుని తండ్రి గిడ్డయ్య, సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్ రాధాకష్ణ, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఎస్.దేవ సహాయం, డివైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర, డప్పు కళాకారుల సంఘం జిల్లా కార్యదర్శి కరుణాకర్, కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు విజయమ్మ, కెవిపిఎస్, ఎస్‌ఎఫ్‌ఐ,డివైఎఫ్‌ఐ సిఐటియు నాయకులతోపాటు వధూవరుల బంధుమిత్రులు పాల్గొన్నారు.

## మదర్ థెరిసా జీవితం నేటి యువతకు ఆదర్శం : కెవిపిఎస్

**ప్రజాశక్తి -ఎమ్మిగనూరు**



మదర్ థెరిసాకు నివాళి అర్పిస్తున్న కెవిఎస్ నాయకులు

మదర్ థెరిసా జీవితం నేటి యువతీ యువకులకు ఆదర్శవంతమైనదని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు దేవ సహాయం పేర్కొన్నారు. సోమవారం మానవతవాది మదర్ థెరిసా సేవలు చిరస్మరణీయమని, మహనీయులను, సంఘసేవకులను, అనుక్షణం స్మరించుకోవాలన్నారు. కెవిపిఎస్ సామాజిక కార్యకర్తలు ,ఎస్ దేవ సహాయం ఆధ్వర్యంలో సోమవారం మదర్ థెరిసా జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలో కెవిపిఎస్ నాయకులు మానవతవాది అమ్మ థెరిసా జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.కవిపిఎస్ మండల కార్యదర్శి ఎస్.తిమ్మన్న మాట్లాడుతూ మనదేశ స్వాతంత్ర సమరయోధులను మహనీయులను సమాజానికి సేవలు అందించిన ప్రతి ఒక్కరిని మదర్ థెరిసా గారిని స్మరించుకుంటూ వారు సమాజానికి చేసినటువంటి సేవలను స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో నడవాలని తెలిపారు. కెవిపిఎస్ మండల అధ్యక్షులు అరుణ్, చిన్నప్ప, నాయకులు చిన్న నరసన్న, అంథోని, కలుగట్ల రాజు, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

**ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్ :** ఈ నెల 29,30 తేదీలలో రాజమండ్రిలో జరిగే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్,సీనియర్ ఉషు పోటీలకు డే స్కాలర్ పాఠశాలల విద్యార్థులు ఎంపిక అయ్యారు. వారిని సోమవారం పాఠశాలలో అభినందించారు. ప్రిన్సిపల్ కేబీ జ్యోతి మాట్లాడుతూ చిన్నారులు చదువుతోపాటు ఉషు మార్షల్ ఆర్ట్స్ లో రాణించాలన్నారు. ఈరోజుల్లో మహిళలు తప్పకుండా ఈ క్రీడా అభ్యాసం చేయాలని, ఆత్మ రక్షణకు తోడ్పడుతుందన్నారు. మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీల్లో పథకాలు సాధించాలని, జాతీయ స్థాయిలో పాల్గొనాలని తెలిపారు. పాఠశాల నుండి 15 మంది వివిధ రకాల ఈవెంట్స్‌లలో పాల్గొంటున్నారని తెలిపారు.



# సాయి సుబ్బయ్య రవీంద్ర విద్యాసంస్థల్లో కృష్ణాష్టమి వేడుకలు

**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్**



శ్రీకృష్ణాష్టమి ప్రత్యేకతలను వివరిస్తున్న కరస్పాండెంట్ పిబివి సుబ్బయ్య

స్థానిక మాధవినగర్‌లోని రవీంద్ర ఇంగ్లీషు మీడియం స్కూల్, రెవెన్యూకాలనీలోని రవీంద్ర టాలెంట్ స్కూల్స్‌లో కరస్పాండెంట్ పిబివి సుబ్బయ్య అధ్యక్షతన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ పిబివి సుబ్బయ్య మాట్లాడుతూ హిందూ పంచాంగం ప్రకారం, ప్రతి ఏడాది శ్రావణ మాసంలో క్రిష్ణ పక్షంలో వచ్చే అష్టమి రోజు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను జరుపుకుంటారన్నారు. శ్రీకృష్ణ జన్మాష్టమి ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వివరించారు. చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషదారణలో ఆకట్టుకున్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాలొన్నారు.

**హారిజాన్స్ ఇంటర్ నేషనల్ ప్లే స్కూల్‌లో...**

స్థానిక గణేష్ నగర్‌లోని హారిజాన్స్ ఇంటర్నేషనల్ ప్లే స్కూల్‌లో ఛైర్మన్ ప్రదీప్ కుమార్, డైరెక్టర్ పావని అధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషదారణలో అలరించారు. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

**ఆదోని:** పట్టణంలో శ్రీ కష్ణాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. స్థానిక కార్వాన్ పేటలోని వేణుగోపాల స్వామి ఆలయంలో శ్రీకృష్ణుడికి పూజలు, భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆలయం నుంచి పురవీధులలో వేణుగోపాల స్వాముల రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. రథోత్సవం ముందు చిన్నారులు కలశాలు, శ్రీకృష్ణ గోపికల వేషధారణలో అలరించారు. గురవయ్యల నత్యాలు, కోలాటాల మధ్య భక్తులు సందడి చేస్తూ రథోత్సవం సాగింది. అంతకుముందు టిడిపి నాయకురాలు గుడిసె ఆది కృష్ణమ్మ, విట్టా రమేష్ స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

**సి బెళగల్ :** మండలంలో సోమవారం పోలకల్, గొల్లలదొడ్డి గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి.గొల్లలదొడ్డిలో సంతాన శ్రీ కృష్ణ దేవాలయంలో దేవధాయ శాఖ అధికారి మురళీ గ్రామ పెద్దల సమక్షంలో ఊరేగింపుగా పల్లకి సేవ నిర్వహించారు. **దేవనకొండ :** మండలంలోని దేవనకొండ, కోటకొండ, బండపల్లి, గుండ్లకొండ, పల్లె దొడ్డి తదితర గ్రామాల్లో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను సోమవారం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు వేషధారణలో అలరించారు. బండపల్లి గ్రామంలో శ్రీకృష్ణుని విగ్రహం ప్రతిష్ఠించారు. పి కోటకొండ గ్రామంలో శ్రీకృష్ణుని చిత్రపటాన్ని ఊరేగించారు



ఆదోనిలో కృష్ణాష్టమి వేడుకల ఊరేగింపు



ఆస్పరిలో చిన్నకృష్ణ, గోపిక



దేవనకొండలో శ్రీ చిన్నికృష్ణ వేషధారి

# చిన్మయ మిషన్‌కు డాక్టర్ శంకర్‌శర్మ రూ.లక్ష విరాళం



చిన్మయ మిషన్ జిల్లా ఇన్చార్జికి రూ.లక్ష చెక్కును అందజేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

**ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్**

మనిషి జీవితం శాశ్వతం కాదని, జీవించినంత కాలం చేసిన సేవా కార్యక్రమాలు చిరకాలం గుర్తు ఉంటాయని ప్రతి ఒక్కరు గుర్తించాలని ప్రముఖగ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్‌శర్మ సూచించారు. సమాజంలో ధర్మాన్ని రక్షించేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని, ధర్మో రక్షతి రక్షితః అనే సూక్తిని ప్రతి ఒక్కరూ పాటించాలని అన్నారు. కర్నూలు నగరంలోని వెంకటరమణ కాలనీలోని ప్రముఖ ఆధ్యాత్మిక సంస్థ చిన్మయ మిషన్‌కు సోమవారం డాక్టర్ శంకర్‌శర్మ రూ.ఒక లక్ష విరాళాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మం ప్రపంచ దేశాలకు ఆచరణీయమని, అమెరికా లాంటి దేశంలో హిందూ దేవాలయాల నిర్మాణం ఇందుకు నిదర్శనమని అన్నారు. కర్నూలు నగరంలో వేదాలు ,భగవద్గీత వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న చిన్మయా మిషన్‌కు తన వంతుగా రూ.ఒక లక్ష విరాళం ఇవ్వడం ఆనందంగా ఉందని చెప్పారు. ఇలాంటి సంస్థలను ప్రోత్సహించేందుకు దాతలు ముందుకు రావాల్సిన అవసరం ఉందని వివరించారు. ప్రస్తుతం ఉన్న సమాజాన్ని గమనిస్తే ఆందోళన కలుగుతుందని ,సమాజంలో క్రమశిక్షణలోపించడంతోపాటు మద్యం, గంజాయి, మాదకద్రవ్యాలు, జూదం వంటి చెడు అలవాట్లకు యువత బానిసలు కావడం ఆందోళనకరమన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా జీవించేందుకు ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. మానవాళిని రక్షించడం, చెట్లను కాపాడటం, సకల జీవరాశులను ఆదరించడం వంటి అంశాలే హిందూ ధర్మంలో ఇమిడి ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం సమాజంలో మహిళలకు ఎలాంటి రక్షణ లేకుండా పోయిందని ,జరుగుతున్న సంఘటనలను చూస్తే ఒళ్ళు గగుర్పాటు కలుగుతుందని తెలిపారు.ఇలాంటి సంఘటనలకు దూరంగా జీవించేందుకు చిన్మయ మిషన్లో చేపడుతున్న కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. అనంతరం చిన్మయ మిషన్ కర్నూలు జిల్లా ఇన్చార్జి సుప్రేమానంద సరస్వతి మాతాజీ మాట్లాడుతూ చిన్మయ మిషన్‌కు డాక్టర్ శంకరశర్మ రూ.లక్ష విరాళం అందజేయడం ఆయన సేవా గుణానికి నిదర్శమని అన్నారు. డాక్టర్ శంకర్‌శర్మ కేవలం ఒక వైద్యుడే కాదని ఆయనలో ఆధ్యాత్మిక శోధకుడు ఉన్నాడని వివరించారు. డాక్టర్ శంకర్ శర్మ తమ సంస్థతో నిరంతరం సహకారాన్ని కొనసాగించాలని, భవిష్యత్తులో తమ సంస్థను సందర్శించాలని ఆమె ఆకాంక్షించారు. తమ సంస్థ విద్యార్థులకు చదువు చెప్పడంతో పాటు ఉచిత వైద్య శిబిరాలు వంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుందని వివరించారు. అవొపా ప్రతినిధులు నాగేశ్వరరావు, రత్న ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం

## చిప్పగిరి ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్లు



డాక్టర్లు పార్వతమ్మ, అఫ్రోజ్‌జహన్

**ప్రజాశక్తి-చిప్పగిరి**

సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని చిప్పగిరి ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్లు పార్వతమ్మ, అఫ్రోజ్‌జహన్ మండల ప్రజలకు తెలిపారు. ప్రజాశక్తి44 వార్షికోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ వారు మాట్లాడారు. వర్షాకాలం ప్రారంభమవ్వగానే అనేక సీజనల్ వ్యాధులు ప్రభలే అవకాశం ఉందని, ఈ అంటూ వ్యాధులు రాకుండా ఉండేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ మధ్యకాలంలో కండ్ల కలక ఎక్కువైందని, ఇది అంత ప్రమాద కరమైంది కాదని, తగు జాగ్రత్తలు అవసం ామన్నారు. మనం నివసిస్తున్న ఇండ్లలో పరిసరాల ప్రాంతాలలో పరిశుభ్రత ఉండేలా చూసుకోవాలన్నారు. మన ఇంటి చుట్టుపక్కల కూడా నీరు నిలువ లేకుండా చూసుకోవాలన్నారు. మనం కూడా బాధ్యతగా మన ఇంటి చుట్టూ పరిసరాలను ఎంత శుభ్రంగా ఉంచుకుంటే మనకే మంచిదన్నారు. చిప్పగిరి ఆసుపత్రిలో తాము బాధ్యతలు చేపట్టాక పనితీరు మెరుగ్గా ఉందన్నారు. ఆసుపత్రిలో మామూలు కాన్పులు దగ్గర నుంచి గర్భవతులకు, వృద్దులకు ఎవరు వచ్చినా ఆసుపత్రి దగ్గర సరైన వైద్య చికిత్సలు చేయించి పంపుతున్నామన్నారు. 24 గంటలు ప్రతి ఒక్క డాక్టర్ అందుబాటులో ఉండి రోగులకు వైద్య చికిత్సలు అందిస్తున్నామన్నారు. మన ప్రభుత్వ ఆసుపత్రి పనితీరుపై ప్రభుత్వం కూడా మంచి కితాబు ఇచ్చిందన్నారు. ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్య సిబ్బంది అందరూ కూడా మంచి సహకారం అందిస్తున్నారన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో 100శాతం మామూలు కాన్పులు చేయడానికి సిబ్బంది కృషి చేస్తున్నారన్నారు. మనం చేసే వైద్య చికిత్సల వల్ల ఆసుపత్రికి వచ్చే రోగులందరు కూడా సంతృప్తికరంగా వెళుతున్నారన్నారు

# పత్రికలు వారధిగా పనిచేయాలి

## చిప్పగిరి ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్



**ప్రజాశక్తి- చిప్పగిరి :** పత్రికలు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారిదిగా వ్యవహరించాలని ఇన్చార్జి తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్ తెలిపారు. ప్రజాశక్తి 44 వార్షికోత్సవం సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో వాస్తవాలు తెలుసుకోకుండా కొన్ని సంఘటనలు ప్రచారం కావడం వల్ల అనర్థాలు జరిగిన సందర్భాలు ఉన్నాయి. కానీ ప్రజాశక్తి దినపత్రిక మాత్రం వాస్తవాలను మాత్రమే ప్రచురిస్తూ ప్రజలకు అధికారులకు అండగా నిలుస్తుంది. ప్రజా సమస్యల అజెండాగా ప్రజాశక్తి దినపత్రిక కొనసాగుతూ ఉండడం అభినందనీయం. భవిష్యత్తులో ప్రజలను చైతన్య పరచాలని ఆకాంక్షిస్తున్నా.

# బస్సు రాకతో బంటనహాల్ ప్రజల హర్షం

**ప్రజాశక్తి-చిప్పగిరి**


బస్సును ప్రారంభిస్తున్న గుమ్మనూరు నారాయణ

గత వారం రోజుల కిందట బంటనహాల్ గ్రామ ప్రజలు మా గ్రామానికి బస్సు నడపాలని గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంకు, ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతి పత్రం ఇచ్చారు. గుమ్మనూరు జయరాం సహకారంతో ఆర్టీసీ బస్సు గ్రామానికి వచ్చిన నేపథ్యంలో సర్పంచి సుశీలమ్మ, టిడిపి సీనియర్ నాయకులు సురేష్, గ్రామ ప్రజలు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సోదరుడు గుమ్మనూరు నారాయణ చేతుల మీదుగా బస్సును పూల మాలలతో అలంకరించి ప్రారంభించారు. ప్రజలు ఇబ్బందులు చూసి వెంటనే స్పందించి మా గ్రామానికి బస్సు వేయడానికి సహకరించిన వారందరికీ కూడా ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామని గ్రామ సర్పంచి, ప్రజలు తెలిపారు. బస్సు రావడంతో గ్రామంలో ప్రజలు మహిళలకు, ముఖ్యంగా విద్యార్థులకు సంతోషాలకు అవధులు లేకుండా పోయాయి.

# విలువలతో కూడిన పత్రిక ప్రజాశక్తి

## కో ఆప్షన్ సభ్యులు సర్వర్ ఖాన్

**ప్రజాశక్తి-చిప్పగిరి**



రాజకీయ, సామాజికపరంగా సామాన్యులను సైతం చైతన్యపరిచే విధంగా కథనాలను, వార్తలను ప్రచురిస్తూ ప్రజాశక్తి దినపత్రిక ముందుకు సాగుతుందని మండల కోఆప్షన్ సభ్యులు సర్వర్ ఖాన్ తెలిపారు. ప్రజాశక్తి 44వ వార్షికోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడారు. కేవలం ప్రచారం కోసం కాకుండా ఉన్నది ఉన్నట్లు కథనాలు ప్రచురిస్తూ విలువలతో కూడిన పత్రికగా ప్రజాశక్తి నిలిచిందన్నారు. భవిష్యత్తులో కూడా ప్రజాశక్తి మంచి కథనాలు ప్రచురిస్తూ ప్రజల్లో చైతన్యం పెంచాలని తెలిపారు. ప్రజాశక్తి దినపత్రిక 44వ వార్షికోత్సవం సందర్భంగా మండల ప్రజలకు, పత్రిక యాజమాన్యానికి విలేకరులకు శుభాకాంక్షలు తెలిపారు.

# ముందంజలో వాస్తవ కథనాల ప్రజాశక్తి

## ఎపిఒ మాధవ శంకర్



**ప్రజాశక్తి-చిప్పగిరి :** సమాజంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఆకట్టుకునే కథనాలు అందించడంలో ప్రజాశక్తికి ప్రత్యేకత ఉందని ఎపిఒ మాధవ శంకర్ అన్నారు. ప్రజాశక్తి 44వ వార్షికోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. 44 ఏళ్ళుగా పత్రిక రంగంలో దూసుకుపోతున్న ప్రజాశక్తి మరింత అభివృద్ధి చెందాలన్నారు.

# సమాజసేవే హనుమంతరావు నైజం

**-జడ్‌పి స్కూలులో సరస్వతీ దేవీ మందిర నిర్మాణం- దేవీ విగ్రహ ప్రాణ ప్రతిష్టాపన**

**-వసంత పంచమి రోజున చిన్నారులకు అక్షరాభ్యాసం**



**ప్రజాశక్తి-మద్దికేర**

సేవా భావంతో హనుమంత రావు సమాజ హితం కోసం చేస్తున్న కార్యక్రమాలు ఎంతో స్ఫూర్తి దాయకంగా ఉన్నాయి. మద్దికెర మండలం పెరవలి గ్రామానికి చెందిన హనుమంతరావు చేస్తున్న సేవా కార్యక్రమాలపై ప్రజాశక్తి ప్రత్యేక కథనం. పెరవలి గ్రామానికి చెందిన తలారి అంజినయ్య,అచ్చమ్మ దంపతుల కుమారుడు హనుమంతరావు చిన్నతనంలో ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా పట్టుదలతో ఉన్నంత చదువులు చదివారు. పెరవలిలో పదవ తరగతి, పత్తికొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివారు. హిందూపురంలో బీకాం,హైదరాబాదులో పీజీ డిప్లమా ఇన్ ఐఆర్‌పిఎం , బెంగళూరులో ఎల్ఎల్‌బి కోర్సును చేశారు. ప్రస్తుతం బెంగళూరులో ఉద్యోగమునకు విఆర్ఎస్ తీసుకొని బ్యాంకింగ్ వర్క్సులో స్థిరపడ్డాడు. తన జన్మస్థల మైన పెరవలి గ్రామ అభివృద్ధిలో పాలుపంచుకోవాలని ఆలోచనతో తన వంతుగా గ్రామంలో పలు మంచి పనులు చేస్తూ ముందుకు వెళ్తున్నారు.

**సరస్వతీ దేవీ మందిర నిర్మాణం- విగ్రహ ప్రతిష్టాపన :** మనిషి జీవితంలో చదువు ప్రాధాన్యతను తెలియజేసి వారిలో ప్రేరణ కలిగించాలని ఉద్దేశంతో , గ్రామంలో నిరక్షరాస్యత నిర్మూలనకు తాను చదువుకున్న జడ్‌పి స్కూలులో శ్రీ సరస్వతీ దేవీ విగ్రహ ప్రాణ ప్రతిష్టాపన చేశారు. 2020 జనవరి 31న ఆగమ శాస్త్రం ప్రకారం రాజస్థాన్ నుంచి తెప్పించిన అమ్మ వారి పాలరాతి విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఈ కార్యక్రమానికి అప్పటి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, పలువురు ప్రముఖులు హాజరయ్యారు. అప్పటి నుంచి ప్రతి ఏడాది వసంత పంచమి రోజున సరస్వతీ దేవీ పూజ చేయించి గ్రామంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్నారు. ఈ సందర్భంగా అన్నవితరణ కార్యక్రమం కూడా నిర్వహిస్తారు.

**శ్రీ రంగనాథ స్వామి ఆలయంలో ఉత్తర ముఖ ద్వారం ముందు షెడ్డు నిర్మాణం**

ఆధ్యాత్మిక బావం మెండుగా ఉన్న హనుమంతరావు గ్రామ ఇలవేల్పు లైన శ్రీ రంగనాథ స్వామి దేవాలయంలో ఉత్తర ముఖ ద్వారం ముందు షెడ్డు నిర్మాణం చేశారు. ఈ షెడ్డు నిర్మాణం చేయడంతో వైకుంఠ ఏకాదశి రోజున, స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. గ్రామంలో అందరితోనూ కలిసి పోతూ గ్రామ అభివృద్ధిలో తన వంతు సహకారం అందిస్తూ ముందుకు వెళ్తున్నారు.

**ఆస్తులుకన్నా చదువు విలువైనది**

ప్రతి మనిషి జీవితంలో అన్ని ఆస్తుల కన్నా చదువు చాల విలువైనది. తమదగ్గర ఉన్న ఆస్తులు కొన్ని కొన్ని సమయాలలో ఏదో రూపంలో మన నుంచి దూరం కావచ్చు ఏమో కానీ, చదువు మాత్రం మన నుండి దూరం కాదు. ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలను బాగా చదివించి వారి ఉన్నంత జీవితాలకు బాటలు వేయాలి. మానవ సంబంధాలన్నీ ఆర్థిక ఆధ్యాత్మిక సంబంధాలతో ముడిపడి ఉంటాయి. మానవ జీవితంలో ఆధ్యాత్మిక భావం కూడా ఉండాలి అంటారాయన. ఏదేమైనా చదువుతోనే సమాజం మారుతుందంటారు.

## 'గురు రాఘవేంద్ర' పథకానికి మరమ్మతులు చేయాలి

### - వైసిపి ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక


రైతులతో కలిసి మాట్లాడుతున్న బుట్టా రేణుక

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు, నందవరం**

గురు రాఘవేంద్ర ఎత్తిపోతల పథకానికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఎమ్మిగనూరు వైసిపి ఇంచార్జీ బుట్టా రేణుక, నాయకులు శివ నీలకంఠ డిమాండ్ చేశారు. నందవరం మండలంలోని మాచాపురం చెరువు, చిలకలడోన పంప్ హౌస్, గంగవరం పంప్ హౌస్, పూలచింత చెరువులను సోమవారం వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ పంప్ హౌస్‌లలో మోటర్లు, ట్రాన్స్ఫార్మర్లు చోరీ చేసిన దొంగలను ఇంతవరకు గుర్తించకుండా, చోరీకి గురై రెండు నెలలు అవుతున్న ఇంతవరకు మరమ్మతులు చేయకుండా చోద్యం చూస్తున్న అధికారులు, ప్రభుత్వంపై మండిపడ్డారు. ఇప్పుడైనా కనీసం త్వరగా మరమ్మతులు చేసి ఒక పంటకైన నీళ్లు అందించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కనకవీడు లక్ష్మీకాంత్ రెడ్డి, మాజీ ఎల్ఎల్‌సి డైరెక్టర్ గడ్డం నారాయణరెడ్డి, ముగతి విరుపాక్షి రెడ్డి, జెడ్పిటిసిలు, సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యలపై చర్చించాలి : ఎన్ఎస్‌యుఐ

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు :** బుధవారం జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో విద్యారంగ సమస్యలపై చర్చించాలని ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్ యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని ఏర్పాటు చేయాలని, సంక్షేమ వసతి గృహాల పెంపు, రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల పైన చర్చించి, పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని, పలు అంశాలపై మంత్రివర్గంలో చర్చించాలని డిమాండ్ చేశారు.

### వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్‌గా నాగరాజుకు అవకాశం ఇవ్వాలి

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు :** రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్‌గా జనసేన పార్టీ నుంచి బిసి నాగరాజుకు అవకాశం ఇవ్వాలని తాలూకా వికలాంగుల సంక్షేమ సంఘం కన్వీనర్ వి. చెన్నప్ప, కో-కన్వీనర్ నర్సింహులు డిమాండ్ చేశారు. సోమవారం వికలాంగుల సంక్షేమ సంఘం కార్యాలయంలో మాట్లాడుతూ వికలాంగుల సమాజం సంక్షేమాభివృద్ధికై, హక్కులు, చట్టాలు, రాయితీ, రిజర్వేషన్ల సాధన కోసం గత ఎన్నో ఏళ్లుగా సామాజిక ఉద్యమాలు చేస్తూ అనేక మంది వికలాంగులకు చేయూతనందిస్తూ, అటు ప్రభుత్వానికి ఇటు వికలాంగులకు ఓ వారధిలా నిలిచిన జిల్లా అధ్యక్షులు బిసి నాగరాజుకు నామినేటెడ్ పదవి కల్పించాలని కోరారు. సమావేశంలో వికలాంగుల సంఘం కార్యవర్గ సభ్యులు బి.కేశన్న, ఈ.రాజశేఖర గౌడ్, ఎం.సురేష్, కె.వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

## సంఘ సేవకునికి ఎన్‌టిఆర్ జాతీయ అవార్డు


ఉత్తమ అవార్డు అందుకున్న శ్రీనాథ్ గుప్త

**ప్రజాశక్తి - ఆదోని :** ఆదోని పట్టణానికి చెందిన ప్రముఖ సంఘ సేవకుడు, ప్రజాసేవా తత్పరుడు, ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా), ప్రపంచ ఆర్య వైశ్య మహా సభ (వామ్) అధ్యక్షులు వంకదారు శ్రీనాథ్‌గుప్తాకు విజయవాడకు చెందిన ప్రముఖ మదర్ సర్వీస్ సొసైటీ సోమవారం ఎన్‌టిఆర్ జాతీయ అవార్డు ప్రదానం చేసారు. గత ఏడాదిలోనే దాదాపు 28 కంటి, పంటి, వాస్కులర్, ఫర్టిలైటీ, గుండె, కిడ్నీ, అక్యూప్రెషర్, జనరల్‌చెకప్ లాంటి ఉచిత మెడికల్ క్యాంపులు అవోపా, వామ్, లయన్స్ క్లబ్ సంస్థల ద్వారా నిర్వహించారు. ఎన్నో వేల మందికి, వివిధ అస్పత్రులు, ఆరోగ్యశ్రీ సహకారంతో, దాతల సహాయ, సౌజన్యంతో, కంటి, వాస్కులర్ తదితర ఆపరేషన్లు, ఉచితంగా చేయించారు. ప్రజా ఉపయోగమైన చలివేంద్రం, మజ్జిగ పంపిణీ తదితర సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారు. పలు రంగాలను ప్రోత్సహించే డాక్టర్స్ డే, లాయర్స్ డే, ఇంజనీర్స్ డే, సిఎడే, టీచర్స్ డే, మదర్స్ డే, ఉమెన్స్‌డే, సీనియర్ సిటిజన్ డే, జర్నలిస్ట్ డే, ఫోటోగ్రఫీ డే,చిల్డ్రన్స్ డే లాంటి ఎన్నో దినోత్సవాలను నిర్వహించి ఆయావృత్తుల్లో విశేషమైన సేవలు అందించిన వారికి సన్మాన సత్కారాల చేశారు. విశిష్టమైన సేవలను ప్రజలకు తెలియపరచినందుకు, బ్రేస్ట్ ఫీడింగ్ వీక్- అవగాహన సదస్సు, అవయవ దాన - అవగాహన సదస్సు , క్యాన్సర్ -అవగాహన సదస్సు, లాంటి ఎన్నో సదస్సులు నిర్వహించి, పుర ప్రజలకు ఎంతోమందికి దాని ముఖ్య ఉద్దేశాలు అయ్యేలా ప్రముఖ డాక్టర్లు, లాయర్లు విద్యావేత్తలతో చెప్పించడం, అవగాహన కల్పించినందుకు, ముఖ్య జాతీయ దినోత్సవాలైన, రిపబ్లిక్ డే, ఇండిపెండెన్స్ డే, గాంధీ జయంతి, పొట్టి శ్రీరాములు జయంతి, వివేకానంద జయంతి లాంటి ముఖ్య దినాలను పాటించడం లో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రులలో రోగులకు ఉచితంగా పళ్ళు, బ్రేడ్ కిట్లు పంచారు. శరణార్థులకు ఉచితంగా దుప్పట్లు పంచడం, పిల్లలకు ఉచిత నోట్ బుక్స్, కలరింగ్ కిట్లు పంచడం, వంటి ప్రజా ఉపయోగం, ప్రజాహితమైన పనులు చేసినందుకు, మహిళలకు సంక్రాంతి ముగ్గుల పోటీలు, పిల్లలకు దేశభక్తుల గురించి వక్తృత్వ, వ్యాసరచన పోటీలు, నిర్వహించి బహుమతులు ప్రధానం చేసినందుకు, యువకులకు, నిరుద్యోగులకు, ఉచిత కంప్యూటర్ శిక్షణతోపాటు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వంకదారు శ్రీనాథ్ గుప్తాకు ఈ అవార్డు దక్కడం, తమ సంస్థలకు ఎంతో గర్వకారణమని, అవోపా, వామ్, ఆర్య వైశ్య సంఘం, పెద్దలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సన్మానం శ్రీనాథ్ గుప్తాకు దక్కడం సముచిత, పారదర్శకం, సమయోజతమని, వివిధ సంఘాల నాయకులు ప్రజా ప్రతినిధులు తెలిపారు.

## ఇచ్చిన హామీలు 100శాతం అమలు

**ప్రజాశక్తి - ఆదోని :** రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులు క్లిష్టంగా ఉన్న ప్రణాళిక బద్ధంగా ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం తప్పక అమలకు శ్రీకారం చుడుతుందని మాజీ ఎమ్మెల్యే టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మీనాక్షి నాయుడు, దీమా వ్యక్తం చేశారు. ఆదోని పట్టణం 19వ వార్డు మండగిరిలో వెలసిన శ్రీఈశ్వర దేవాలయంలో శ్రావణ మాసం నాల్గవ సోమవారం మాజీ ఎమ్మెల్యే , టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు కె మీనాక్షి నాయుడు విశేష పూజలు నిర్వహించారు. ఆలయం చేరుకున్న ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వేద పండితుల పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. మీనాక్షి నాయుడు మాట్లాడారు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సారథ్యంలో 100 శాతం అమలు జరుగుతుందన్నారు. వార్డు ఇన్చార్జి శ్రీనివాస్ ఆచారి, నాయకులు వేణుగోపాల్ రెడ్డి, బసాపురం రామస్వామి, బుద్దారెడ్డి, ఎన్టీఆర్ ఫ్యాన్స్ పట్టణ అధ్యక్షుడు చంద్‌బాష, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.


ఆలయాన్ని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు

# ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు


కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న మంత్రి ఎన్ఎండి ఫరూక్

**ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్**

నంద్యాల జిల్లా వ్యాప్తంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. నంద్యాల పట్టణంలోని పద్మావతి నగర్‌లో ఉన్న శ్రీకృష్ణ ఆలయంలో కమిటీ సభ్యులు, మాజీ కౌన్సిలర్ వాకా శివశంకర్ యాదవ్ మిత్ర బృందం ఆధ్వర్యంలో జరిగిన కృష్ణాష్టమి వేడుకల్లో రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్‌లు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మంత్రి ఎన్ఎండి ఫరూక్‌ను, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, కౌన్సిలర్లు కండే శ్యామ్ సుందర్ లాల్, నాగార్జున, మాజీ కౌన్సిలర్ విశ్వనాథ్ రెడ్డి తదితరులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పార్థసారథి, వాకా వరప్రసాద్ యాదవ్, సాయి సప్లయర్స్ గోపాల్, అజ్మీర్ , 29వ వార్డు ఇంచార్జ్ మంజుల సుబ్బరాయుడు , 19వ వార్డు వడ్డె జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు. **బనగానపల్లె :** మండలంలోని యనకండ్ల గ్రామంలోని కృష్ణ మందిరంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు యాదవ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 7 గంటలకు స్వామివారికి గోపూజ, గణపతి పూజ, అర్చన, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు సానెం బాలసుబ్బయ్య యాదవ్, బాణాల రామసుబ్బయ్య యాదవ్, పెండేకంటి వెంకటసుబ్బయ్య యాదవ్, దాట్ల శ్రీరాములు యాదవ్‌ల ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉట్టి మహోత్సవం నిర్వహించారు. సాయంత్రం శ్రీకృష్ణుని ఉత్సవ విగ్రహాలను గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. కోలాట బృందం నిర్వహించిన కోలాటం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో అఖిలభారత యాదవ మహాసభ నియోజకవర్గ కన్వీనర్ మద్దయ్య యాదవ్, గొర్రెల పెంపకదారుల సహకార సంఘం అధ్యక్షులు దాట్ల జానకి రాముడు యాదవ్, ఉపాధ్యక్షులు సానం బాల తిమ్మయ్య యాదవ్, యాదవ సంఘం నాయకులు పెండేకంటి నాగసుబ్బయ్య యాదవ్, మంటి బ్రహ్మయ్య యాదవ్, శివ యాదవ్, ఉమ్మడి అంకన్న యాదవ్, బాణాల మస్తాన్ యాదవ్, నాగరాజు యాదవ్, చెరువుపల్లె నాగరాజు యాదవ్, ఎర్ర పాపన్న గారి సుబ్బయ్య యాదవ్, బ్రహ్మం యాదవ్, గీత కమిటీ సభ్యులు శివయ్య, బిసి మహేశ్వరరెడ్డి, మహిళలు పాల్గొన్నారు. **నంద్యాల :** పట్టణంలోని బాలచంద్ర సమత విద్యానికేతన్‌లో కృష్ణాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. కృష్ణుడు, గోపికల వేషధారణలో విద్యార్థులు అలరించారు. అనంతరం శ్రీకృష్ణుడు ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. **బేతంచెర్ల**లోని శ్రీ సరస్వతి విద్యా శిశు మందిర్ ఆధ్వర్యంలో విద్యార్థినీ విద్యార్థులు పట్టణ పురవీధుల గుండా చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణలతో, కోలాటం చెక్కభజనల ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. **అవుకు**లోని కృష్ణుని దేవాలయం వద్ద త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక కమిటీ సభ్యులు శ్రీకృష్ణుని విగ్రహాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలను నిర్వహించారు. **రుద్రవరం** మండలం హరినగరం గ్రామ సమీపంలోని ఇస్కాన్ అహోబిలం మందిరంలో అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం ఆధ్వర్యంలో శ్రీకష్ణ జన్మాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇస్కాన్ అహోబిలం ఇంచార్జి చంద్రకేశవ దాస్ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం గ్రూపుల వారీగా యువకులకు ఉట్టి కొట్టే పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి సహకరించిన పలువురు ప్రజా ప్రతినిధులకు, పోలీస్ శాఖ వారికి, పెద్దలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. **కోవెలకుంట్ల** మండలంలోని కోవెలకుంట్ల, కలుగొట్ల, దేవునిపాడు, పెద్ద కొప్పెర్ల, రేవనూరు, చౌదరిదిన్నె గ్రామాలలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. **ఆళ్లగడ్డ** పట్టణంలోని శ్రీ భారతి విద్యా మందిరం పాఠశాలలో కృష్ణాష్టమి పర్వదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలోని సరస్వతి దేవి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పాఠశాల కమిటీ అధ్యక్షుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త టీఎంసీ వేణుగోపాల్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు అందరు కృష్ణాష్టమి వేడుకలలో పాల్గొన్నారు. ఆనంతరం చిన్నారులచే ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సావిత్రమ్మ, రామలింగారెడ్డి, గంగాధర్, సుధాకర్ రావు తదితరులు పాల్గొన్నారు. **సంజామల** మండల పరిధిలోని అన్ని గ్రామాలలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. కానాల, గిద్దలూరు, పేరు సోముల, ముదిగేడు, ముక్కమల్ల, ఆకుమల్ల, నొస్సం గ్రామాలలో వేడుకలు నిర్వహించారు. **శ్రీశైలం :** కృష్ణాష్టమిని పురస్కరించుకుని శ్రీశైలం ఆలయ ప్రాంగణంలో సోమవారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా శ్రీగోకులంలో గోపూజను నిర్వహించారు. అతివృష్టి, అనావృష్టి నివారించడానికి సకాలంలో సంమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండి దేశం, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ.. అర్చక స్వాములు, వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమములో ఆలయ ఇఓ పెద్దిరాజు దంపతులు, సహాయ కార్యనిర్వహణాధికారి ఐఎన్‌వి మోహన్, పర్యవేక్షకులు డి. స్వర్ణలత, అర్చకులు, వేదపండితులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు. **అలాగే శ్రీశైలం ప్రాజెక్టు :** శ్రీశైల మండలం సున్నిపెంటలో కృష్ణాష్టమి వేడుకలను షిరిడి సాయిబాబా ఆలయ ప్రాంగణంలో యాదవుల సంఘం ఆధ్వర్యంలో బాలవర్ధి పర్యవేక్షణలో ఘనంగా నిర్వహించారు. శ్రీశైలం దేవస్థానంలో నిర్వహించిన వేడుకల్లో సిఐ ప్రసాదరావు దంపతులు పాల్గొన్నారు. అలాగే సాయంత్రం 6 గంటలకు నిర్వహించే ఉట్టి కొట్టే కార్యక్రమంలో గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా రూ. 2016, రెండవ బహుమతిగా రూ. 1116లను అందజేయనున్నట్లు యాదవ సంఘం సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక యాదవ్ సంఘం సభ్యుడు డాక్టరు టి. నాగరాజు, రామసుబ్బయ్య, డాక్టర్ వేణుగోపాలు తదితరులు పాల్గొన్నారు. **ఆత్మకూరు :** శ్రీపతిరావుపేట, కరివేన, ఆత్మకూర్ తదితర గ్రామాల్లో యాదవ సంఘం ఆధ్వర్యంలో సోమవారం శ్రీకృష్ణాష్టమిని ఘనంగా నిర్వహించారు. ముందుగా సుద్ధుల రచ్చబండ వద్ద భక్తులు శ్రీకృష్ణుని చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. సాయంత్రం కోలాటంతో పుర వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. చిన్నారుల శ్రీకృష్ణుని వేషధారణలు అందరినీ ఆకట్టుకున్నాయి. **వెలుగోడు :** పట్టణంలోని పొట్టి శ్రీరాములు సెంటర్‌లో కృష్ణాష్టమి వేడుకలను శిశుమందిర్ విద్యార్థుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వేడుకలకు డిఎస్పి రామాంజి నాయక్, వెలుగోడు ఎస్ఐ విష్ణు నారాయణ ముఖ్య అతిథులుగా హాజరై చిన్నారులను అభినందించారు. కార్యక్రమంలో రాఘవరావు, రిటైర్డ్ ప్రిన్సిపాల్ జనార్దన్ రెడ్డి, శిశుమందిర్ పాఠశాల హెచ్ఎం సుబ్రహ్మణ్యం శర్మ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **మిడుతూరు :** స్థానిక శ్రీకృష్ణ దేవాలయంలో టిడిపి నాయకులు ఖాతా రమేష్ రెడ్డి రామచంద్రారెడ్డి, భక్తులు స్వామివారికి పాలాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ చెన్నకేశవ స్కూల్ విద్యార్థులచే ఆటపాటలు నిర్వహించారు. కార్యక్రమంలో రామ్మోహన్, వెంకటరమణ, జయరాం, రవి పాల్గొన్నారు. **మహానంది :** మండలంలోని వివిధ ఆలయాల వద్ద జరిగిన కృష్ణాష్టమి వేడుకల్లో చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణలతో అలరించారు. కోలాటం, ఆట పాటలతో శ్రీకృష్ణుని ఆలయాల వద్ద కోలాహలం నెలకొంది. శ్రీకృష్ణుని చిత్రపటానికి భక్తులు పూలమాలలు వేసి ఘనంగా పూజలు నిర్వహించారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమంలో చిన్నారులు, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.


బగానపల్లెలో....

# నేరస్తులపై ప్రత్యేక నిఘా : డిఎస్పీ


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్పి

**ప్రజాశక్తి - ఆత్మకూర్**

నేరాలపై, నేరస్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆత్మకూరు డిఎస్పి రామాంజి నాయక్ పేర్కొన్నారు. స్థానిక డిఎస్పీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీసులంటే ప్రజల్లో నమ్మకాన్ని పెంచి మెరుగైన సేవలు అందిస్తూ నేరాలపై ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ప్రతి ఫిర్యాదును పరిశీలించి త్వరితగతిన పరిష్కరిస్తామని, మహిళలు ఎలాంటి ఫిర్యాదులు అందించినా తక్షణ చర్యలు చేపట్టి న్యాయం చేస్తామన్నారు. క్రికెట్ బెట్టింగ్, జూదం, గంజాయి, సారాయి తదితర చట్ట వ్యతిరేకమైన చర్యలకు పాల్పడితే ఎంతటి వారైనా సరే సహించేది లేదని చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. నందికొట్కూర్, ఆత్మకూరు సర్కిల్ పరిధిలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నేరస్తులు తమ ప్రవర్తనలో మార్పు తెచ్చుకొని మంచి మార్గంలో నడుచుకోవాలని సూచించారు. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా వ్యాపారులు ప్రజలు సహకరించాలని లేదంటే చర్యలు తప్పవన్నారు. వినాయక చవితి సమీపిస్తుండడంతో అందరూ సమిష్టి కృషితో పోలీసుల అనుమతి తీసుకొని వేడుకలు నిర్వహించుకోవాలని తెలిపారు. చిన్నారులు రోడ్లపై తాడుకట్టి చందాలు వసూలు చేస్తే వారిపై వారి తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామన్నారు. శాంతి భద్రతలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. సమావేశంలో సిఐ సురేష్ కుమార్ రెడ్డి, ఇన్‌ఛార్జీ ఎస్ఐ చంద్రశేఖర్ ఉన్నారు.

# సిద్దాపురానికి బస్సు సౌకర్యం కల్పించాలి


బస్సు సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యేను కోరుతున్న దృశ్యం

**ప్రజాశక్తి - ఆత్మకూరు** : మండలంలోని సిద్దాపురం గ్రామంలోని విద్యార్థుల కోసం బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ.. ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డికి గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు జవహర్ నాయక్ విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి సోమవారం వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిద్దాపురం గ్రామంలో 6-10వ తరగతి వరకు సుమారు 100 మంది వెంకటాపురం ఉన్నత పాఠశాలలో చదువుతున్నారని ఎమ్మెల్యేకు వివరించారు. పేద విద్యార్థులు ఆటోలకు అధిక ఛార్జీలు చెల్లించలేక పాఠశాలకు వెళ్లడం లేదన్నారు. మరి కొంత మంది బాల కార్మికులుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే కళాశాల విద్యార్థులు సైతం బస్సు సౌకర్యం లేనందున తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యేకు విన్నవించారు. ఆత్మకూరు నుంచి వెంకటాపురం మీదుగా సిద్దాపురంకు విద్యార్థుల కోసం ఉదయం 8 గంటలకు, సాయంత్రం 4 గంటలకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ... ఆర్టీసీ డిపో మేనేజర్‌తో మాట్లాడి సిద్దాపురం గ్రామానికి విద్యార్థుల కోసం బస్సు సౌకర్యం కల్పిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేసిన వారిలో సిద్దాపురం మాజీ సర్పంచి వెంకటరమణ, డీలర్ ఎస్తేరమ్మ, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.

# జలాశయానికి 1,32,281 క్యూసెక్కుల నీటి ప్రవాహం

**ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు :** శ్రీశైలం జలాశయానికి ఎగువ పరివాహక ప్రాంతాల నుండి మళ్లీ నీటి ప్రవాహం పెరిగింది. సోమవారం సాయంత్రం 6 గంటలకు 1,32,281 క్యూసెక్కుల నీరు చేరింది. ఇదే సమయానికి ఎగువ జూరాల గేట్లు, విద్యుత్ ఉత్పాదన నుండి 1,30,001, సుంకేసుల ద్వారా 2,280 క్యూసెక్కులతో కలిపి 1,32,281 క్యూసెక్కుల నీళ్లు చేరుతున్నాయి. రెండు విద్యుత్ కేంద్రాల్లో గడచిన 24 గంటలలో కుడిగట్టు విద్యుత్తు కేంద్రంలో 28,169 క్యూసెక్కుల నీటితో 7.893 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. ఎడమ గట్టు భూగర్భ జల విద్యుత్తు కేంద్రంలో 37,822 క్యూసెక్కుల నీటితో 16.823 మిలియన్ యూనిట్ ఉత్పత్తి ద్వారా దిగువ సాగర్‌కు 66,051 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అలాగే శ్రీశైలం బ్యాక్ వాటర్ నుండి హంద్రీనీవా సుజల స్రవంతికి 1460 క్యూసెక్కులు, మహాత్మా గాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్‌కు 1196 క్యూసెక్కులు, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌కి 30వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయ నీటిమట్టం 884.00 అడుగులు కాగా నీటి నిల్వ సామర్థ్యం 2,10,0320 టీఎంసీలుగా ఉంది.

# వ్యవసాయ రంగ పరిరక్షణకు ఐక్య ఉద్యమాలు : వ్యకాస


మాట్లాడుతున్న వ్యకాస, సిఐటియు నాయకులు

**ప్రజాశక్తి - మిడుతూరు**

పాలకులు అవలంభిస్తున్న విధానాలతో వ్యవసాయ రంగ పరిక్షణకు ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి పకీరి సాహెబ్, సిఐటియు పట్టణ కార్యదర్శి టి.గోపాలకృష్ణ రైతులకు పిలుపునిచ్చారు. ఈ నెల 29, 30న ఒంగోలులో నిర్వహించే వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర స్థాయి సమావేశాల సందర్భంగా మండలంలోని చౌట్కూర్ గ్రామంలో సన్నాహక సమావేశాన్ని వ్యకాస మండల కార్యదర్శి టి. బోబులేసు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలో 65% పైగా ప్రజలు వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారని, వ్యవసాయ రంగానికి పాలకులు బడ్జెట్లో తగిన ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో సంక్షోభంలోకి కూరుకు పోతుందన్నారు. వ్యవసాయరం పరిరక్షణ కోసం సమైక్య ఉద్యమాలకు సిద్ధదం కావాలని పేర్కొన్నారు. సమావేశంలో వ్యకాస నాయకులు వెంకటేశ్వర్లు వడ్డే మదిలేటి, పెద్ద స్వాములు, జి సామేలు, రాజు పాల్గొన్నారు.

# సిఐని సన్మానించిన యాదవులు


సిఐని సన్మానిస్తున్న యాదవ సోదరులు

**ప్రజాశక్తి - పాణ్యం :** మండలంలోని అన్నీ గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యంగా మండల కేంద్రంలోని కృష్ణ దేవాలయం, వీర నారాయణ స్వామి దేవాలయంలో స్వామి వారి కళ్యాణానిన భక్తులు ఉత్సాహంగా తిలకించారు. అనంతరం యాదవులు సిఐ కిరణ్ కుమార్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. జ్వాలలక్ష్మీ గాయత్రి, కెఆర్ఆర్, విజయా నికేతన్ పాఠశాలల విద్యార్థులు చేసిన నృత్యాలు, కోలాటాలు అందరినీ ఆకట్టుకున్నాయి. మాజీ సర్పంచు పుల్లయ్య ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

## వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమం

**ప్రజాశక్తి - ఆదోని :** సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ఆగస్టు ఒకటో తేదీన ఇచ్చిన తీర్పునకు వ్యతిరేకిస్తూ ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని మాల మహానాడు నాయకులు స్పష్టం చేశారు ఆదోనిలో సోమవారం ఉద్యమ నిర్వహణ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా రంగన్న, లక్ష్మీ నారాయణలను ఆదోనిలోని జేబీ గార్డెన్‌లో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. వారు మాట్లాడుతూ ఆదోని డివిజన్ మాల కులస్తులందరూ ఏకమై నాన్ ఎంప్లాయిస్ నూతన కమిటీని ఏర్పాటు చేసుకుని భవిష్యత్ కార్యక్రమం చేపట్టేందుకు కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. నూతన కమిటీ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా సాయిరాం, డి నరేష్ కుమార్, కోశాధికారిగా నగరూర్ చంద్ర, లీగల్ అడ్వైజర్ ఎం జనార్ధన్, ఏ చెన్నయ్య, గౌరవ సలహాదారులుగా కుమారస్వామి, బొజ్జప్ప, నరసన్న, వీరేష్‌లను ఎన్నుకున్నారు.

## 'భార్గవ రాయల్' 8వ వార్షికోత్సవం

**ప్రజాశక్తి - సి బెళగల్**

మండలంలోని భార్గవ రాయల్ పాఠశాలలో సోమవారం 8వ వార్షికోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సంస్కృతిక, నృత్య, పద్య, సామాజిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడం తమ పాఠశాల లక్ష్యమని కరస్పాండెంట్ వెంకటస్వామి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ పాఠశాలల సంఘం జిల్లా, మరియు డివిజన్ నాయకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# బస్టాండ్‌లో మౌలిక వసతులకు కృషి : ఎమ్మెల్యే బుడ్డా



బస్ సర్వీసులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

**ప్రజాశక్తి - ఆత్మకూరు :** ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి సరైన మౌలిక వసతులను కల్పించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. ఆత్మకూర్ నుండి కర్నూలకు రెండు కొత్త బస్సు సర్వీసులను ఎమ్మెల్యే సోమవారం జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం బస్టాండ్ ఆవరణంలోని దుకాణాలను పరిశీలించి ప్రయాణికులతో మాట్లాడారు. ఆర్టీసీలో నెలకొన్న సమస్యలను సిబ్బంది ఎమ్మెల్యేకు వివరించారు. తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యనూ త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, ఆర్టీసీ అధికారులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రతి పోలీసూ క్రమశిక్షణతో మెలగాలి : డిఎస్పీ


పోలీస్ సిబ్బందితో మాట్లాడుతున్నడిఎస్పీ

**ప్రజాశక్తి - ప్యాపిలి :** విధి నిర్వహణలో ప్రతి పోలీసూ క్రమశిక్షణతో మెలగాలని డోన్ డిఎస్పి శ్రీనివాసులు పేర్కొన్నారు. ప్యాపిలి పోలీస్ సర్కిల్ కార్యాలయాన్ని ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది పని తీరు, ప్రజలకు అందుతున్న సేవలపై స్థానిక సిఐ వెంకట్రామిరెడ్డిని డిఎస్పీ అడిగి తెలుసుకున్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు ఉంటాయన్నారు. చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలు, అక్రమ దందాలు, రవాణాపై నిఘా పెంచాలని, మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. సంఘటన జరిగిన తర్వాత జరిగే రియాక్టివ్ పోలీస్ కంటే ముందే పసిగట్టి నివారించగలిగే ప్రొయాక్టివ్ పోలీసింగ్ ఉత్తమమన్నారు. ఉమెన్ సేఫ్టీలపై భంగం కలిగిస్తే తీవ్రమైన పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానిక పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డుకు అడ్డంగా తాళ్లుకట్టి.. 'గణేష్' చందాల వసూళ్లు

**- ప్రమాదాల భారిన వాహనదారులు**


వాహనాలు నిలిపి చందాలు వసూలు చేస్తున్న దృశ్యం

**ప్రజాశక్తి - పగిడ్యాల :** గ్రామాల్లోని పలువురు పిల్లలు రోడ్డుకు అడ్డంగా తాళ్లుకట్టి వినాయక చవితి వసూళ్లు చేస్తున్నారు. ప్రధాన రహదారులపై తాళ్లను అడ్డంపెట్టి వచ్చిపోయే వాహనాలను నిలిపి చందాలు వసూలు చేస్తున్నారు. పిల్లలు రోడ్డుకు అడ్డంగా తాళ్లుకట్టి నిలబడడంతో వచ్చిపోయే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆదమరిచి వేగంగా వస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పలువురు వాహన దారులు వాపోతున్నారు. మండలంలోని బీరవోలు, కెసి కెనాల్ బ్రిడ్జి సమీపాన రహదారికి అడ్డంగా తాడు పట్టుకొని నిలబడి గణేష్ విగ్రహం కోసం పిల్లలు సోమవారం చందాలు వసూళ్లు చేస్తున్నారు. మోటార్ సైకిల్‌పై వేగంగా వస్తున్న వ్యక్తులు తాడును తట్టుకొని ప్రమాదాలకు గురౌతున్నారు. రోడ్లపై నిలబడి చందాలు వసూళ్లు చేయకూడదని తల్లిదండ్రులు పిల్లలకు వివరించాలని పలువురు కోరుతున్నారు.

# శ్రీశైలానికి సందర్శకుల తాకిడి

**- వరుస సెలవులతో పెరిగిన రద్దీ - ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు : ఇఓ డి.పెద్దిరాజు**



**ప్రజాశక్తి - శ్రీశైలం :** వరుస సెలవులు రావడంతో శ్రీశైలం మల్లన్న ఆలయానికి సందర్శకుల తాకిడి నెలకొనడంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. భక్తులు వేకువజామూమున నుంచే పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామిని దర్శించుకునేందుకు క్యూలైన్ కంపార్టుమెంట్లలో బారులు తీరారు. భక్తుల రద్దీ నెలకొనడంతో క్యూలైన్లలో ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశామని ఆలయ ఇఓ పెద్దిరాజు పేర్కొన్నారు. కంపార్ట్మెంట్లలో ఉన్నభక్తులకు అల్పాహారం, పాలు, బిస్కెట్స్, తాగునీళ్లు అందిస్తున్నట్లు ఇఓ తెలిపారు.

# మదర్ థెరిస్సా సేవలు చిరస్మరణీయం

**- వేదాస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ కదిరి కోట సునీల్ కుమార్**


మదర్ థెరిస్సా జయంతిని నిర్వహిస్తున్న సంస్థ నిర్వాహకులు

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు**

మదర్ థెరిసా 114వ జయంతి ఉత్సవాలు సామాజిక వేత్త , వేదాస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ కదిరి కోట సునీల్ కుమార్ ఆధ్వర్యంలో ఎమ్మిగనూరు లోని యం.బి యెరూషలేము చర్చ్ కూడలిలోని మదర్ థెరిసా విగ్రహం దగ్గర నిర్వహించారు. ముఖ్య అతిథిగా అంతర్జాతీయ దైవ సేవకులు రెవరెండ్ ప్రవీణ్ పగడాల పాల్గొని మదర్ థెరీసా విగ్రహానిక పూలమాల వేసి నివాళులు అర్పించి కేక్‌ను కట్ చేశారు. ఆయన మాట్లాడులతూ మదర్ థెరిసా సేవా తత్వం ప్రపంచానికే ఆదర్శమని కొనియాడారు. సేవ చేయుటకు దేశాలు అడ్డుగోడ కాదని, ప్రాంతము ఒక అంతరమే కాదని నోబుల్ శాంతి గ్రహీత మదర్ థెరిసా నిరూపించారన్నారు. మదర్ థెరిసా అడుగుజాడల్లో ప్రతి ఒక్కరు నడుచుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంబి చర్చ్ పాస్టర్ జయన్న, సెక్రటరీ భాస్కర్ బాబు, మల్లెల గ్రూప్స్ అధినేత ఆల్ఫ్రెడ్ రాజు, ఉషా గ్రూప్స్ యజమాని రామస్వామి, టీచర్ సుధాకర్, దేవపుత్ర, పౌల్ రాజ్, యహోషువా, విజయరాజ్, డేవిడ్, జై భీమ్ రాష్ట్ర అధ్యక్షులు చిక్కెమ్ జానయ్య, మైనారిటీ నాయకులు నజీర్ పాల్గొన్నారు.

# ప్రజలకు ప్రభుత్వానికి వారధి ప్రజాశక్తి పత్రిక

**ఆలూరు ఎమ్మెల్యే బూసినే విరుపాక్షి**

**ప్రజాశక్తి-చిప్పగిరి**

వాస్తవాలను వెల్లడించే ప్రజాస్వామ్యం వారిదిగా ప్రజాశక్తి నిలుస్తుందని ఆలూరు నియోజకవర్గం ఎమ్మెల్యే బూసినే విరుపాక్షి అన్నారు. 44వ వార్షికోత్సవం సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. ఆయన మాటల్లో... నిత్యం ఏ మూలాన ఏ అన్యాయం జరిగినా వెంటనే స్పందించి వార్తగా మారుస్తుంది. సమాజంలో జరిగే చీకటి కోణాలను ఎప్పటికప్పుడు వెలుగులోకి తీసుకొస్తుంది. ప్రజలను చైతన్యం చేసే కరదీపికగా ప్రజాశక్తి పనిచేస్తుంది. దౌర్జన్యాలకు, దాడులకు ఏమాత్రం అదరక, బెదరక ప్రజలకు అండగా నిలుస్తుంది. పీడితజాతుల గొంతుకగా మారి నినదిస్తుంది.



సామాన్యుల కష్టసుఖాల్లో తోడునీడిగా ఉంటుంది. అవినీతిపరుల గుండెల్లో సింహ స్వప్నమై నిలిచింది. మంచిని ప్రోత్సహిస్తూ చెడును చీల్చి చెండాడే సురకత్తి ప్రజాశక్తి. ఇలాంటి పత్రిక సమాజంలో ఉన్నప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యపడుతుంది. సమాజంలో అంతా సమానమేనని కుల, మత, ప్రాంతీయ, లింగ భేదాలు లేని సమ సమాజం రావాలన్నదే ప్రజాశక్తి ప్రధాన లక్ష్యంగా పనిచేస్తుంది. విలువలకు ప్రతిరూపంగా పత్రిక నిలుస్తుందన్నారు. పత్రిక దిన దినాభివృద్ధి సాధించి ప్రజలకు చేరువ కావాలన్నదే మా కోరిక.

## సమగ్ర సస్యరక్షణతోనే అధిక దిగుబడి

**ఎఒ జయలక్ష్మి**

**ప్రజాశక్తి-చిప్పగిరి**



మండలం లోని రైతులు ఖరీఫ్, రబీ సీజన్లో సాగు చేసుకున్న వివిధ రకాల పంటల్లో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టినప్పుడే అధిక దిగుబడి పొందుతారని వ్యవసాయ శాఖ అధికారి జయలక్ష్మి తెలిపారు. ప్రజాశక్తి 44 వ వార్షికోత్సవం సందర్భంగా ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రైతు సేవా కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రైతు సేవ కేంద్రాలలో విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. సాగు చేసుకున్న పంటల వివరాలను తప్పనిసరిగా రైతు సేవా కేంద్రాలలో రైతుకు సంబంధించిన వివరాల జిరాక్స్ కాపీలను తీసుకెళ్లి నమోదు చేయించాలన్నారు. రైతులు పంట మార్పిడి తప్పనిసరిగా అనుసరించాలన్నారు. రసాయనికి ఎరువులు వాడకుండా సేంద్రియ ఎరువులు వాడకాన్ని అలవాటు చేసుకోవాలని రైతులకు సూచించారు.

## ప్రజా సమస్యలు పరిష్కారానికి ప్రజాశక్తి కృషి

**మనోహర్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ**



**చిప్పగిరి:** ప్రజాశక్తి ప్రజా సమస్యలే అజెండాగా ముందుకు సాగుతుంది. ప్రజాశక్తి 44 వార్షికోత్సవం సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలిపారు. సమస్యలు ఎన్ని ఉన్నా తన అజెండాను మార్చుకోకుండా ముందుకు వెళుతున్న ప్రజాశక్తి దినదినాభివృద్ధి చెందడం శుభ పరిణామం. వాస్త వాలు రాస్తూ ప్రజలలో ఎనలేని అభిమానం పత్రిక సంపాదించుకున్న పత్రిక యాజమాన్యానికి, సిబ్బందికి, విలేకరులకు శుభాకాంక్షలు







